ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

# వార్త సంధ్య

vaartha sandhya
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

NO SMOKING ALCOHOL
SAY NO TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 65 మంగళవారం 17 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 65 Tuesday 17 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# సన్న వడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల

- రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త
- సన్న వడ్లకు బోనస్ బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం
- సన్న వడ్లకు బోనస్ బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల
- ఇప్పటి వరకు రూ.1,939.58 కోట్ల బోనస్ నిధులు చెల్లింపు
- వానాకాలంలో సన్న వడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు బోనస్
- వరి బోనస్ బకాయిలను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులు విడుదల



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 16 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. గత ఖరీఫ్ సీజన్ సంబంధించి పెండింగ్ వరి సన్న రకాల బోనస్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో సన్న రకాల వరి పంట సాగు చేసిన అన్నదాతలకు క్వింటాల్ ధరపై 500 రూపాయల బోనస్ కోసం 514.36 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక కేటాయింపులు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కీలకమైన పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సన్న రకాల వరి పంట - మిగతా 2 లో

## ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం
## 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

- రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండలను దక్కించుకున్న కాంగ్రెస్
- కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ విజయం
- జనగాం,తొర్రూర్,క్యాతనపల్లి, జహీరాబాద్ మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా
- కోరం లేకపోవడం వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 16 :** తెలంగాణలో ఐదు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. బీజేపీ, సీపీఐ పార్టీలు చెరో కార్పొరేషన్‌ను దక్కించుకున్నాయి. రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ, కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐ దక్కించుకున్నాయి.రామగుండం, మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్గొండలలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చింది. నిజామాబాద్ కార్పొరేషన్ బీజేపీకి అవకాశాలు ఉన్నప్పటికీ, - మిగతా 2 లో



2 లో

## మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తయ్యేలోపుడ బీజేపీ పీఠం ఎక్కుతుంది

- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్
- నిజామాబాద్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పొత్తు పెట్టుకున్నాయన్న అర్వింద్
- మూడు పార్టీలు కలిసి బీజేపీని ఓడించాయని వ్యాఖ్య
- కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్న

## విశాఖలో అట్టహాసంగా అంతర్జాతీయ నౌకాదళ ఉత్సవాలు

2 లో



విశాఖలో ఘనంగా ప్రారంభమైన IFR - 2026

50 దేశాలు, 70 యుద్ధనౌకలతో మెగా వేడుకలు

పది రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు, 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

2 లో



## 3 రోజుల్లో 6,000 మంది ఊచకోత

- సూడాన్‌లో పారామిలిటరీ దళాల అరాచకం
- సుడాన్‌లోని దార్పుర్‌లో పారామిలిటరీ దళాల మారణకాండ
- మూడ్రోజుల్లోనే 6,000 మందికి పైగా అమాయక పౌరుల హత్య
- రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అరాచకాలపై ఐరాస నివేదిక
- ఇవి యుద్ధ నేరాలు, మానవత్వంపై ఘోరాలని ఐక్యరాజ్యసమితి వెల్లడి

# దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు

- రాష్ట్రాలను కలుపుతూ భారీ నెట్‌వర్క్
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- మాదక ద్రవ్యాల రవాణాకు చెక్
- దేశమంతా సీసీ కెమెరాల అనుసంధానం
- ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- సరిహద్దుల్లో అధునాతన టెక్నాలజీ
- ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి కీలక వ్యాఖ్యలు



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 16 :** డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా పటిష్ఠమైన 'సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్'ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా దేశాన్ని భయపెడుతున్న నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు భారతదేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశ యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిని సమూలంగా అంతం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది.ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా - మిగతా 2 లో

## ఉండవల్లిలో అరటితోటను సందర్శించిన బిల్ గేట్స్

- ఏపీ వ్యవసాయంలో టెక్నాలజీని చూసి ఆశ్చర్యం
- సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ క్షేత్రస్థాయిలో పర్యటన
- వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పరిశీలన
- టెక్నాలజీ వాడుతున్న రైతులను అభినందించిన సీఎం
- ఏఐతో రైతులకు సలహాలు అందిస్తున్నామని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 16 :** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన ఉండవల్లిలోని అరటి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ఏపీ ప్రభుత్వం వినియోగిస్తున్న ఆధునిక - మిగతా 2 లో

# హలో ఫ్రెండ్! హౌ ఆర్ యూ ?

- ముగిసిన బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటన
- ఐదున్నర గంటలపాటు వివిధ కార్యక్రమాలు
- సీఎంతో కలిసి సచివాలయంలో ఆర్టీజీఎస్‌ను సందర్శించిన బిల్ గేట్స్
- ఆర్టీజీఎస్ ద్వారా పౌర సేవలను వేగంగా అందిస్తున్న తీరును వివరించిన సీఎం
- డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్‌ను తెలుసుకున్న బిల్ గేట్స్
- బిల్ గేట్స్‌తో మళ్లీ సమావేశం కావడంపై సీఎం చంద్రబాబు స్పందన
- 1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిశానని వెల్లడి
- అప్పుడు ఐటీ విజన్.. ఇప్పుడు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంపై చర్చించామని వివరణ
- అమరావతి సచివాలయంలో నా విజన్‌ను ఆయనకు వివరించానన్న చంద్రబాబు



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 16 :** బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటన ముగిసింది. విజయవాడ నుంచి ముంబై మీదుగా ఢిల్లీకి వెళ్లనున్నారు. దాదాపు ఐదున్నర గంటల పాటు వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు. బిల్ గేట్స్ అమరావతి పర్యటన సందర్భంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక - మిగతా 2 లో

## అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

- సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించిన కేసు
- అంబటికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరిన న్యాయవాది పొన్నవోలు
- పూర్తి స్థాయి విచారణ కోసం కస్టడీ అవసరమన్న పోలీసుల తరపు న్యాయవాది



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 16 :** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల - మిగతా 2 లో

# సంపాదకీయం

## బంగ్లాలో మళ్లీ బీఎన్పీ



తారీఖ్ రహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని కాబోతున్నారు. మూడున్నర దశాబ్దాల తరువాత ఆ పీఠం మీద ఒక పురుషుడు కూచోబోతున్నారు. ఆ దేశానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి మగ ప్రధాని కూడా. జీవితంలో ఒక్క ఎన్నిక కూడా గెలవని వ్యక్తి ఇప్పుడు నేరుగా దేశపాల కుడైనాడు. పదిహేడేళ్ళ ప్రవాసంలో ఉండి, ఓ యాభై రోజుల క్రితమే దేశంలో కాలూనిన తారీఖ్ నేతృత్వంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) మూడింట రెండువంతుల స్థానాలు గెలుచుకోవడం విశేషం. లండన్‌లో ఉంటూ, యూనిస్ ప్రభుత్వం మీద ఎప్పటికప్పుడు ఒత్తిడి పెంచుతూ, ఎన్నికల తేదీ ప్రకటించిన తరువాతే స్వదేశానికి రావడం, ఈ స్వల్పకాలంలోనే ఆయన తల్లి, బీఎన్పీ అధినాయకురాలు ఖలీదా జియా కన్నుమూయడం ఈ భారీ విజయానికి దోహదం చేశాయి.హసీనా పార్టీ బరిలో లేకపోవడం ఓటింగ్ శాతాన్ని బాగా తగ్గించినా, అనుకున్నట్టుగానే ఖలీదా పార్టీకి లాభించింది. అవామీలీగ్ ఓట్‌బ్యాంక్ గణనీయంగా బీఎన్పీవైపు మళ్ళింది. పట్టణప్రాంతాలు, మధ్యతరగతి, మహిళలు జమాత్‌ఏ ఇస్లామీని ఆదరించలేదు కనుక, ఆది మనం భయపడినట్టుగా ఘన విజయాలు సాధించలేదు. తమ దేశం మరో అఫ్ఘానిస్థాన్ కాకూడదని బంగ్లా మహిళలు అనుకొని ఉంటారు. అధికశాతం యువత కూడా జమాత్‌తో పోల్చితే బీఎన్పీ ఉత్తమమని భావించింది. హిందువులతో సహా మైనారిటీలంతా పెద్దసంఖ్యలో బీఎన్పీకే ఓటేశారు. అయినప్పటికీ, కొత్త సభలో జమాత్ పదకొండుపార్టీల కూటమితో బలమైన విపక్షంగా నిలబడగలిగింది. ఎన్నికల్లో లబ్ధికోసం హిందువులమీద దాడులకు పాల్పడిన జమాత్‌ను యూనిస్ ప్రభుత్వం ఇతోధికంగా ఎగదోసింది. ఒకదశలో జమాత్ మహాద్భుత విజయం సాధిస్తుందన్న అంచనాలు కూడా వెలువడ్డాయి. చివరకు, ఈ పాకిస్థాన్ అనుకూల మతఛాందసశక్తి అధికారంలోకి రాకూడదన్న భారత్ కోరిక నెరవేరింది. విద్యార్థి ఉద్యమమే హసీనా ప్రభుత్వాన్ని కుప్పకూల్చి, ఆమెను దేశంనుంచి వెళ్ళగొట్టినప్పటికీ, నేషనల్ సిటిజెన్స్ పార్టీ ఈ ఎన్నికల్లో స్వల్ప విజయాలు సాధించడం ఆశ్చర్యం. తిరుగుబాటు కాలంలో వల్లెవేసిన ఆదర్శాలు, ఎజెండాలు గాలికి కొట్టుకుపోయి, అంతిమంగా జమాత్‌తో చేయికలపడం వారిని అరడజను స్థానాలకు పరిమితం చేసింది. హసీనాను గద్దెదించడంలో కీలకంగా వ్యవహరించిన విద్యార్థి నాయకులంతా జమాత్ విద్యార్థి విభాగానికి చెందినవారే.భవిష్యత్తులో జమాత్ మరింత బలపడవచ్చునేమో కానీ, ఇప్పటికైతే మూడింట రెండువంతుల మెజారిటీతో బీఎన్పీ గెలిచినందుకు సంతోషించాలి. తొలి ప్రసంగంలోనూ, ఎన్నికల సందేశాల్లోనూ తారీఖ్ దృక్పథం ఏంటో తెలుస్తోంది. దేశంలో కాలూనగానే 'ఐ హావ్ ఏ ప్లాన్' అంటూ యావత్ దేశాన్ని ఒక్కటిగా ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అన్ని మతాలను పేరుపేరునా ప్రస్తావించి సమానంగా చూస్తానన్న సందేశాన్ని ఇచ్చాడు. 'బంగ్లాదేశ్ ఫస్ట్' అంటూ భారత్, పాకిస్థాన్ తనకు సమదూరమన్నాడు. యూనిస్ ప్రభుత్వం చైనా, పాకిస్థాన్‌లతో రాసుకుపూసుకున్న నేపథ్యంలో, కొత్త ప్రధాని తన విధానం 'నాట్ డిల్లీ, నాట్ పిండి' అనడం సంతోషమే. భారత్‌తో ఘర్షణపడే ఉద్దేశంలో ఆయన లేడు. బీఎన్పీ మేనిఫెస్టో కూడా భారత్ పేరు ప్రస్తావించకుండా వాణిజ్యం, నీటిపంపకాలు ఇత్యాది విషయాల్లో సానుకూల వ్యాఖ్యలే చేసింది. యూనిస్ ప్రభుత్వం ఏలుబడిలో దిగజారిన ఉభయదేశాల సంబంధాలు ఇకపై మెల్లగా మెరుగుపడతాయని భావించాలి. హసీనా అధికారంలో ఉన్నప్పటి పూర్తి సానుకూలతనైతే కొత్త ప్రభుత్వం నుంచి ఆశించలేం. బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రిబ్యునల్ ఉరిశిక్ష విధించిన హసీనాను అప్పగించే అంశం రెండు దేశాల మధ్యా ఎన్నటికీ తెగని వివాదంగా, అతుకుపడేందుకు అడ్డంకిగా ఉంటున్నది వాస్తవం. 200106 మధ్యకాలంలో ఖలేదాజియా ప్రధానిగా ఉండగా, జమాత్ భాగస్వామిగా బీఎన్పీ అనుసరించిన భారత వ్యతిరేక వైఖరి తెలిసిందే. పాక్ ఉగ్రసంస్థలకూ, ఈశాన్య రాష్ట్రాల్లోని తిరుగుబాటుదారులకు ఆమె ప్రభుత్వం ఆర్థిక, ఆయుధసాయం అందించింది. ప్రధాని నివాసానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న హవా భవన్‌లో కూచొని, సర్వమూ తానే అయి అన్నీ చక్కబెట్టిన ఖలేదా కుమారుడు ఇప్పుడు తాను మారిన మనిషినని అంటున్నాడు. భారత్‌తో తారీఖ్ రహ్మాన్ 2.0 వ్యవహారం ఎలా ఉండబోతున్నదో చూడాలి.

## ఉండవల్లిలో అరటితోటను సందర్శించిన బిల్ గేట్స్

**మొదటిపేజీ తరువాయి** – టెక్నాలజీని, దాని పనితీరును సీఎం చంద్రబాబు ఆయనకు వివరించారు.ఉండవల్లికి విచ్చేసిన బిల్ గేట్స్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రదర్శించి చూపించారు. అరటి తోటలో డ్రోన్ల సహాయంతో మందులు పిచికారీ చేసే విధానాన్ని బిల్ గేట్స్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, తమ రైతులు సంప్రదాయాలను గౌరవిస్తూనే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందున్నారని, ఇది తనకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు."ఈ విషయాన్నే ఇవాళ ఉండవల్లిలో మిస్టర్ గేట్స్‌తో పంచుకున్నాం. పంటలు, మార్కెట్ ధరలు, నేల స్వభావం ఆధారంగా కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రైతులకు కచ్చితమైన సలహాలు అందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని, సుస్థిర వ్యవసాయ పద్ధతులను కూడా చురుకుగా ప్రోత్సహిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అక్కడి రైతులను అభినందించారు.

## అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

**మొదటిపేజీ తరువాయి** – వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది.ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరఫున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు.పోలీసుల తరఫున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల

**మొదటిపేజీ తరువాయి** – సాగు చేసిన 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.పంటల సాగును ప్రోత్సహించేందుకు : ఈ నిధుల విడుదలతో పాటు పౌరసరఫరాల సంస్థ వరి బోనస్ కోసం ఇప్పటికే 1939.58 కోట్ల రూపాయలు ప్రాసెస్ చేసి అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అనూహ్య వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, కీలక వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చే క్రమంలో పంట సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వరి ఒక క్వింటా ధరపై 500 రూపాయలు అదనపు బోనస్ ఇస్తుండటంతో సన్న రకాల సాగు గణనీయంగా పెరుగుతోంది.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఏ" గ్రేడు ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర 2,389 రూపాయలు కంటే బోనస్ 500 రూపాయలు అదనం. ఈ పెండింగ్ బకాయిలు చెల్లించడం వల్ల రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుల కృషికి తగిన ప్రతిఫలం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం అంకితభావం మరింత బలపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

## ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

**మొదటిపేజీ తరువాయి** – మజ్లిస్ పార్టీ మద్దతుతో దీనిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్‌గా 49వ వార్డు కార్పొరేటర్ ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా మజ్లిస్ పార్టీ 54వ వార్డు కార్పొరేటర్ సల్మా తహసీన్ ఎన్నికయ్యారు.

**11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా :** కోరం లేకపోవడం వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. జనగాం, తొర్రూరు, ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్ నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్ మున్సిపాలిటీలలో ఎన్నిక వాయిదా పడినట్లు అధికారులు ప్రకటించారు.

# ముగిసిన బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటన

**మొదటిపేజీ తరువాయి** – సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, ప్రభుత్వ పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు. బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని సమావేశంలో ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి బిల్ గేట్స్‌ను కలిసిన సంగతి, హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు జరిగిన విధానాన్ని గేట్స్ సమక్షంలో గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఏపీలోని వివిధ ప్రాజెక్టులకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు.10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి: వైద్యరంగంలో తెచ్చిన మార్పులు-సాధించిన ఫలితాలపైనా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బిల్ గేట్స్ అమరావతి పర్యటన చారిత్రాత్మకమన్న సీఎం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ పర్యటన దోహదం చేస్తుందని అన్నారు. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగంలో హైదరాబాద్ మేటిగా నిలబడిందని తెలిపారు. ఏపీలో అన్ని వనరులు ఉన్నాయి, ఇప్పుడు సంపద సృష్టి జరగాల్సి ఉందని అన్నారు. బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని వెల్లడించారు. 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమన్న సీఎం ఇందుకు సాంకేతికతని విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. అమరావతి డిజైన్ అండ్ ఫౌండ్రీ, క్వాంటం వ్యాలీగా ఆవిష్కృతం అవుతుందన్నారు. డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నామన్నారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్: ఎలక్ట్రానిక్స్- ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నామన్నారు. విద్యారంగంలో అధునిక విధానాలను పాటిస్తున్నాం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా బోధనలో మార్పులు చేస్తున్నామన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నామన్నారు. మెరుగైన ప్రజారోగ్య సేవలు అందించేందుకు అత్యున్నత స్థాయి నిపుణులతో సలహా మండలి ఏర్పాటు చేశామని వివరించారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ విధానం ప్రజలకు ముందస్తుగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సాంకేతిక వినియోగాన్ని టెక్ దిగ్గజం బిల్ గేట్స్ ప్రశంసించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని మెచ్చుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని కొనియాడారు. అమరావతి రాజధాని నిర్మాణంలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక గ్రేట్ వర్క్ అని కితాబిచ్చారు. బిల్‌గేట్స్ కితాబు: అమరావతిలోని రియల్‌టైం గవర్నెన్స్ కేంద్రం -ఆర్టీజీఎస్‌ను గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన గేట్స్‌కు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ సాదర స్వాగతం పలికారు. హలో ఫ్రెండ్! హౌ ఆర్ యూ ? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. తాను బాగున్నానని, మీరెలా ఉన్నారంటూ బిల్ గేట్స్‌ను చంద్రబాబు ఆ తర్వాత మంత్రివర్గ సహచరులు, సీఎంఓ అధికారులను పరిచయం చేశారు. అక్కడి నుంచి ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని బిల్‌గేట్స్‌కు సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు సులభతరం చేయడం బాగుందని గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమారాచాన్నిసేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చంద్రబాబు తెలిపారు.'గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుంది, గ్రేట్ వర్క్': ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తూ కీలక సూచీల ద్వారా జీఎస్‌డీపీ వృద్ధిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించగా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. పన్ను వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందన్న గేట్స్ ప్రశంసించగా జీఎస్టీ విధానంతో దేశంలో పన్నుల వసూళ్లు కూడా గణనీయంగా పెరిగిందని సీఎం చెప్పారు. ఇదే సమయంలో ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్ గేట్స్ అడగ్గా చంద్రబాబు వివరించారు. రాజధానిలో 30శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందని, గ్రేట్ వర్క్ అని బిల్ గేట్స్ మెచ్చుకున్నారు.ఆరోగ్య రంగంలో ఏఐ సేవల వివరణ: ఇక గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి బిల్ గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి పరీక్షల వివరాలు ఎలా నమోదు చేస్తున్నారని అడిగారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డుల ఆధారంగా లైఫ్ స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం చెప్పారు. "దట్స్ నైస్" అంటూ సంజీవని ప్రాజెక్టు అమలును బిల్ గేట్స్ ప్రశంసించారు. డయాగ్నోస్టిక్ సేవలు తక్కువ వ్యయానికే అందితే పేదలకు వెసులుబాటు ఉంటుందని గేట్స్ అభిప్రాయపడ్డారు.బిల్‌గేట్స్‌కు స్వాగతం పలికిన లోకేశ్: బిల్ గేట్స్ రాకపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పాలనా రంగాల్లో గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పని చేయడానికి ఏపీ ఎదురు చూస్తోందని, లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సహచర మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ తో కలిసి బిల్ గేట్స్ కు విజయవాడ విమానాశ్రయంలో స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు.మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత దాతృత్వవేత్త బిల్ గేట్స్ సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొని, రాష్ట్ర ప్రాధాన్యతా రంగాలపై బిల్ గేట్స్‌కు వివరించారు.ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 1997లో తాను తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి ఐటీ రంగానికి సంబంధించిన తన విజన్‌ను పంచుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "1997లో నేను తొలిసారి మిస్టర్ బిల్ గేట్స్‌ను కలిశాను. అప్పుడు ఆయనకు నా ఐటీ విజన్‌ను వివరించాను. ఆ రోజు ఒక టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంపై మా మధ్య మొదలైన సంభాషణ, ఇప్పుడు ఒక విస్తృత లక్ష్యంగా రూపాంతరం చెందింది. వినూత్న ఆవిష్కరణలను ఉపయోగించి పాలనలో మార్పులు తీసుకురావడం, ప్రజల జీవితాలను పెద్ద ఎత్తున మెరుగుపరచడమే ఆ లక్ష్యం.ఈ రోజు అమరావతి సచివాలయంలో ఆయనతో మరోసారి భేటీ అయ్యాను. ఈ సందర్భంగా, నా స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆయన ముందు ఉంచాను. ఈ సమావేశంలో మా మంత్రులు, కార్యదర్శులు కూడా పాలుపంచుకుని ఆయనతో సంభాషించారు.మా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించాం. రాష్ట్ర ప్రజలకు సాధికారత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏయే మార్గాల్లో పనిచేయవచ్చో అన్వేషించాం. ఆనాటి మా సంభాషణ నేటి మా విస్తృత లక్ష్యాలకు పునాది వేయడం సంతోషంగా ఉంది" అని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## విశాఖలో అట్టహాసంగా అంతర్జాతీయ నౌకాదళ ఉత్సవాలు

**మొదటిపేజీ తరువాయి** – భారత నౌకాదళం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష' IFR-2026 విశాఖపట్నంలో ఘనంగా ప్రారంభమైంది. మన దేశంలో మూడోసారి జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌కు విశాఖపట్నం రెండోసారి వేదిక అయింది. 2016లో జరిగిన IFR తర్వాత మరోసారి 2026లోనూ విశాఖనే ఎంపిక చేయడం ద్వారా నగర ప్రాధాన్యతను భారత నౌకాదళం మరోసారి చాటిచెప్పింది. ఈ వేడుకలు ఫిబ్రవరి 25 వరకు పది రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో సుమారు 50 దేశాల నుంచి 4,000 మంది అతిథులు, 70కి పైగా అత్యాధునిక యుద్ధనౌకలు పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పది రోజులు విశాఖ నగరం నేవీ సిబ్బంది సందడి, యుద్ధనౌకల వెలుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈసారి ఉత్సవాలు కేవలం IFRకే పరిమితం కాకుండా మూడు ప్రధాన కార్యక్రమాల సమాహారంగా నిర్వహిస్తున్నారు. IFRతో పాటు ప్రతి రెండేళ్లకోసారి జరిగే 'మిలాన్' మల్టీలాటరల్ నేవల్ ఎక్సర్‌సైజెస్, అలాగే ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం



(ఐఓఎన్ఎస్) కార్యక్రమాలు కూడా విశాఖలోనే జరగనున్నాయి. దీంతో హిందూ మహాసముద్ర పరీవాహక దేశాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిత్రదేశాలతో సముద్ర భద్రత, పరస్పర సహకారం అంశాలపై కీలక చర్చలు జరగను న్నాయి. నిన్న సాయంత్రం 'మిలాన్' పేరుతో ప్రత్యేక గ్రామాన్ని ప్రారంభించడం ద్వారా ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ గ్రామంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయా లను ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయగా.. విదేశీ అతిథులకు ఇది 'మినీ ఇండియా'గా కనిపిస్తోంది.కాగా, ఫిబ్రవరి 18న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము యుద్ధనౌకలను సమీక్షించనున్నారు. ఫిబ్రవరి 19న ఆర్కే బీచ్‌లో నిర్వహించే 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్' అత్యంత వైభవంగా జరగనుంది. ఈ పరేడ్‌కు సీఎం నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. అలాగే ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు సముద్రంలో జరగనున్న యుద్ధ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. గతంలో అండమాన్‌కు పరిమితమైన 'మిలాన్' విన్యాసాలను ఈసారి మెరుగైన మౌలిక వసతుల దృష్ట్యా విశాఖకు మార్చడం పర్యాటక రంగానికి ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలు ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, వివిధ దేశాల యుద్ధనౌకలు, జలాంతర్గాములను దగ్గర నుంచి చూసే అరుదైన అవకాశం ప్రజలకు లభించనుంది.

# దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి** – పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. "రాబోయే కొద్ది నెలల్లోనే కొత్త 'జాతీయ భద్రతా నిర్మాణాన్ని' ఏర్పాటు చేస్తాం. దీని ప్రధాన లక్ష్యం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక భారీ సీసీటీవీ నెట్‌వర్క్‌ను సృష్టిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి 'ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్' ఏర్పాటు చేస్తాం. ఈ నిఘా వ్యవస్థకు చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తాం. దీనివల్ల డ్రగ్స్ నేరాలను రియల్ టైమ్‌లో పసిగట్టడం సులభమవుతుంది" అని షా అన్నారు.

**సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత**

కేవలం అంతర్గత భద్రతే కాదు, సరిహద్దుల రక్షణపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని షా తెలిపారు. "దేశంలోని ప్రతి భూ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను ఆధునీకరిస్తాం. నిఘా వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తాం. ఫెన్సింగ్ (కంచె), ఇతర మౌలిక సదుపాయాలను బలపరుస్తాం. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచుతాం. అక్రమ ప్రవేశాలకు ఇక ఆస్కారం ఉండదు" అని తెలిపారు.అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టుల ఏరివేతపై స్పష్టమైన డెడ్‌లైన్ విధించారు. "నక్సలిజం ఒకప్పుడు దేశంలోని 11 రాష్ట్రాలకు విస్తరించి పెద్ద సవాలుగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. ప్రభావిత ప్రాంతాలను మావోయిస్టుల చెర నుంచి విడిపించడానికి మనం చాలా దగ్గరగా ఉన్నాం. మార్చి 31, 2026 నాటికి దేశం నుంచి మావోయిస్టు హింసను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం. ఇది మన భద్రతా దళాలకు దక్కే అతిపెద్ద విజయం." అని అన్నారు.

**భద్రతకు స్వర్ణయుగం**

గత 12 ఏళ్ల కాలాన్ని (2014 నుంచి 2026 వరకు) భారత అంతర్గత భద్రత చరిత్రలో 'స్వర్ణయుగం'గా అమిత్ షా అభివర్ణించారు. "2014కు ముందు దేశాన్ని కశ్మీర్ సమస్య, ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి, మావోయిస్టు హింస అనే మూడు ప్రధాన సమస్యలు వేధించేవి. ఈ మూడు సమస్యలు 3-4 దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడించాయి. కానీ ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు మారాయి. కశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో హింస 80 శాతం తగ్గింది. ఈ మూడు ప్రాంతాలు పూర్తిగా హింస రహితంగా మారే రోజు ఎంతో దూరంలో లేదు" అని వివరించారు.

**ఈశాన్యంలో శాంతి పవనాలు**

ఈశాన్య రాష్ట్రాల్లో వచ్చిన మార్పులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రస్తావించారు. "అక్కడ 10,000 మందికి పైగా యువకులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 20కి పైగా శాంతి ఒప్పందాల ద్వారా ఆ ప్రాంతంలో ప్రశాంతత నెలకొల్పగలిగాం" అని అన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల గురించి కూడా షా మాట్లాడారు. "రాబోయే కాలంలో ఈ చట్టాలను సంపూర్ణంగా, సమర్థవంతంగా అమలు చేయడంపైనే హోం శాఖ దృష్టి సారిస్తుంది. పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు దీనిపై పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నాం. వారికి కావాల్సిన పరికరాలను సమకూరుస్తున్నాం" అని



చెప్పారు.

**దిల్లీ పోలీసులకు ప్రశంసలు**

దేశ రాజధాని రక్షణలో దిల్లీ పోలీసులు చూపుతున్న తెగువను మంత్రి అమిత్ షా కొనియాడారు. "పార్లమెంట్ దాడి కేసు అయినా, ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు అయినా, దిల్లీ పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. క్లిష్టమైన కేసులను ఛేదించడంలో వారి నైపుణ్యం అద్భుతం. దేశ రక్షణలో వారు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. 2029 నాటికి దేశం ఎదుర్కొంటున్న అన్ని భద్రతా సవాళ్లను సమన్వయంతో, నిరంతర కృషితో అధిగమిస్తాం" అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## 3 రోజుల్లో 6,000 మంది ఊచకోత



**మొదటిపేజీ తరువాయి** – సూడాన్‌లో పారామిలిటరీ దళాలు సృష్టించిన మారణకాండపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ చివరిలో దార్ఫుర్ ప్రాంతంలో కేవలం మూడు రోజుల్లోనే రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) దళాలు 6,000 మందికి పైగా పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చినట్లు తెలిపింది. ఈ హింస దిగ్భ్రాంతికరంగా ఉందని, ఇవి యుద్ధ నేరాలు, మానవత్వంపై ఘోరాలతో సమానమని ఐరాస మానవ హక్కుల కార్యాలయం తన నివేదికలో స్పష్టం చేసింది.నార్త్ దార్ఫుర్‌లోని ఎల్-ఫాషెర్ నగరాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో ఆర్ఎస్ఎఫ్, దాని మిత్రపక్ష అరబ్ మిలీషియాలు ఈ ఘాతుకాలకు పాల్పడ్డాయని శుక్రవారం విడుదల చేసిన 29 పేజీల నివేదికలో వివరించింది. సామూహిక హత్యలు, లైంగిక దాడులు, చిత్రహింసలు వంటి అనేక అకృత్యాలకు పాల్పడ్డారని పేర్కొంది. యూనివర్సిటీ ప్రాంగణంలో ఆశ్రయం పొందుతున్న వారిపై కాల్పులు జరపడంతో పాటు, పారిపోతున్న వారిని కూడా వదలకుండా చంపేశారని తెలిపింది. చాలా సందర్భాల్లో జాతి ప్రాతిపదికన ఈ దాడులు జరిగాయని నివేదిక వెల్లడించింది.సూడాన్ సైన్యానికి, ఆర్ఎస్ఎఫ్‌కు మధ్య ఏప్రిల్ 2023 నుంచి అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఈ దాడులు జరిగాయి. "శిక్షలు పడవన్న ధీమానే హింస నిరంతరం కొనసాగేలా ప్రోత్సహిస్తోంది" అని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. 140 మంది బాధితులు, సాక్షులను ఇంటర్వ్యూ చేసి, శాటిలైట్ చిత్రాలతో సరిపోల్చి ఈ నివేదికను రూపొందించినట్లు ఐరాస తెలిపింది. ఈ మారణకాండపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ముందు నిలబెట్టాలని పిలుపునిచ్చింది.

## మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తయ్యేలోపు బీజేపీ పీఠం ఎక్కుతుంది



**మొదటిపేజీ తరువాయి** – నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి బీజేపీని ఓడించి కార్పొరేషన్ ను కైవసం చేసుకున్నాయని మండిపడ్డారు. స్వల్ప మెజార్టీతో తాము మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కోల్పోయామని చెప్పారు. ఈ మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తి కాకముందే మేయర్ పీఠాన్ని బీజేపీ ఎక్కుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు."ఇది నా మాటగా చెబుతున్నాను. మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ ముగిసేలోపు సీన్ రివర్స్ చేసి చూపిస్తాం" అని అర్వింద్ అన్నారు. ఇక్కడికి అక్బరుద్దీన్ ఒవైసీ వచ్చి హిందువులను దూషించినా... ఆత్మాభిమానాన్ని చంపుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంతో కలిసిపోయాయని తీవ్ర విమర్శలు చేశారు.కాళేశ్వరం, కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఈ పొత్తుల వెనుక ఆ రహస్యాలు దాగున్నాయని ఆరోపించారు. పోలీసులు కూడా రాజకీయ రంగుపులు ముకుని బీఆర్ఎస్ కార్పొరేటర్‌ను ఎత్తుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. కరీంనగర్‌లో మేయర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్... నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "కరీంనగర్ మీదనే ఎందుకు ప్రేమ? నిజామాబాద్ మీద ఎందుకు లేదు?" అని ప్రశ్నించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డిలకు నార్కో పరీక్షలు చేస్తే నిజం బయటపడుతుందని అన్నారు.

# మొక్క మీది సంరక్షణ మాది!



**బూర్గంపహాడ్ , ఫిబ్రవరి 16 ( వార్త సంధ్య )** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో వార్డ్ మెంబర్ బత్తుల శిరీష లిపుట్టినరోజు వేడుకలను సోమవారం వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొని అభినందనలు తెలిపారు.గ్రామ పంచాయతీ సెక్రటరీ స్పందన శాలువా వేసి, బొకే తో సత్కరించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. "మొక్కను మీరు నాటండిడ దాని సంరక్షణ బాధ్యత మాది" అంటూ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. పల్లె ప్రకృతి వనం వంటి ప్రదేశాల్లో పుట్టినరోజులు జరుపుకోవడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ సభ్యులు, సిబ్బంది,మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**అచ్చంపేట ప్రతినిధి, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య):** చారకొండ మండల కేంద్రానికి చెందిన డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు తన తలదండ్రులు చిలువేరు మల్లప్ప మల్లమ్మ జ్ఞాపకార్థంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రం కి వచ్చే భక్తుల సౌకర్యార్థము పద్మశాలి సత్రంలో వైద్య శిబిరం నిర్వహించినారు ఈ సందర్భంగా డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు మాట్లాడుతూ కథ 17 సంవత్సరాల నుండి శ్రీశైలం నందు పద్మశాలి సత్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు మహాశివరాత్రి సందర్భంగా పద్మశాలి సత్రం నందు వచ్చే భక్తుల కు 14 15 16 మూడు రోజులు శ్రీశైలం వచ్చే యాత్రికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు యాత్రికులకు ఉచిత మందులు అందించామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సత్రం అధ్యక్షులు కర్నాటి శ్రీధర్ కార్యనిర్వాహక అధ్యక్షులు జేరపు చంద్రశేఖర్ కోశాధికారి ఏలే యాదయ్య మాజీ అధ్యక్షులు వర్గాల సూర్యనారాయణ బాసర పద్మశాలి సత్రం అధ్యక్షులు రాపోలు సుధాకర్ సత్రం మేనేజర్ వేల్పుల కృష్ణ అసిస్టెంట్ మేనేజర్ జి గోవిందరాజు సత్రం సిబ్బంది పీవీ గిరిధర్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం న్యాయవాదుల విధుల బహిష్కరణ..




**కొత్తగూడెం, ఫిబ్రవరి 16(వార్త సంధ్య)** : హైదరాబాద్ లో అత్తపూర్ న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు నిరసనగా ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఫర్ తెలంగాణ ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన కొత్తగూడెం బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్య కు నిరసనగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు విధులు బహిష్కరణ చేశారు. అనంతరం ఉపాధ్యక్షుడు జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన కోర్టు గేట్ బయట ప్లకార్డ్ లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ కు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వలను గోపి కృష్ణ డిమాండ్ చేశారు. న్యాయవాదులకు సంరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఫర్ తెలంగాణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లను జనపరెడ్డి గోపి కృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హన్మంతరావు, చిరంజీవి రావు, పి. నాగేశ్వరరావు, కే.పుల్లయ్య, మన్మోహన్, యెర్రాపాటి కృష్ణ, శ్రీధర్, మహమ్మద్ సాదిక్ పాషా, మారపాక రమేష్, మహేష్, చిన్ని కృష్ణ, విజయ్, రమేష్, ఏర్ర శ్రీను, మధన్ మోహన్, కేపి, తదితరులు పాల్గొన్నారు.

## కన్నాల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు



**మంథని, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య)** : మంథని మండలంలోని కన్నాల గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయమును దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ నుండి కొత్తగూడెం మేయర్
# కష్టానికి దక్కిన గౌరవం




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్'కు తొలిసారి జరిగిన ఎన్నికల్లో సిపిఐ ఘనవిజయం సాధించింది. కార్పొరేషన్ లోని 60 స్థానాల్లో సిపిఐ ఒంటరిగా పోటీ చేసి 23 స్థానాల్లో విజయం సాధించింది, 22 స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు విజయం సాధించగా ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థికి మద్దతు తెలిపి ప్రచారం చేయడం ద్వారా స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్'తో ఒప్పందం కుదుర్చుకొని మేయర్ స్థానాన్ని ఏకగ్రీవంగా కైవసం చేసుకొని కమ్యూనిస్టు పార్టీ సత్తా చాటింది.

మేయర్ : మూడ్ గణేష్ ,డివిజన్ : 20వ డివిజన్ (సుజాతనగర్ టౌన్),తండ్రి : రాములు,భార్య : మూడ్ సింధు,కుమారుడు : సాత్విక్ ,విద్యార్హత : ఐటిఐ (ఎలెక్ట్రిసియాన్), గత పదవి : తాజామాజీ ఎంపిటిసి(2019లోఎన్నిక). పార్టీ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ,పార్టీలో పదవి : సిపిఐ సుజాతనగర్ మండల కార్యవర్గ సభ్యులు స్వగ్రామం కోమటిపల్లి కొత్తగూడెం కార్పొరేషన్లో కలవడంతో కార్పొరేటర్ గా పోటీ చేశాడు.

# ప్రజల ఆకాంక్షతలకు అనుగుణంగా పనిచేయాలి

### బిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఎంపీ రవిచంద్ర పిలుపు
### మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికను బహిష్కరించిన బిఆర్ఎస్
### తెలంగాణ తల్లికి నివాళులు అర్పించిన కార్పొరేటర్లు

**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16(వార్త సంధ్య) :** బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొత్తగూడెం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ మీద అభిమానంతో మీపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా విశ్వాసాన్ని చూరాగొనాలని సూచించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావులతో కలిసి ఎంపీ రవిచంద్ర కొత్తగూడెం కార్పొరేషన్ లో కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ కార్పొరేటర్లతో స్థానిక తెలంగాణ భవన్ లో సమావేశమయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిఆర్ఎస్ పక్షాన ఎన్నికైన కార్పొరేటర్లు దూరంగా ఉన్నారు. తదనంతరం జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమాన్ని కూడా పార్టీ నిర్ణయం మేరకు కార్పొరేటర్లు బహిష్కరించారు. తొలుత



బిఆర్ఎస్ కార్పొరేటర్లు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్లతో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. కార్పొరేషన్ లో అధికార పక్షం చేసే తప్పులను, గుర్తించి.. ఎప్పటికప్పుడు వాటిని ఎండగడుతూ నిలదీయాలని పిలుపు నిచ్చారు. అవసరమైతే ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని సూచించారు.

# కలిసి కట్టుగా ముందుకు సాగుతాం

### కార్పోరేషన్ అభివృద్ధే ధ్యేయం
### నూతన పాలక వర్గానికి అభినందనలు
### ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16(వార్త సంధ్య) :** కార్పోరేషన్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. కార్పోరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ ఎకగ్రీవ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాత నగర్లోని కొంత ప్రాంతం కలుపుకుని కార్పోరేషన్గా ఏర్పడిందని, ఆ కార్పోరేషన్కు ఈనెల 11న ఎన్నికలు జరగగా, 13న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని చెప్పారు. చిన్నచిన్న బేదాభిప్రాయాల కారణంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు విడివిడిగా స్నేహపూర్వక పోటీలో భాగంగా ఎన్నికల్లోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో సిపిఐ 22 డివిజన్ల వ్యాప్తంగా విజయం సాధిచడంతో పాటు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలిపిన స్వతంత్ర కార్పోరేటర్తో కలిసి మొత్తం 23 సీట్లు సాధించామ న్నారు. సిపిఐకి చెందిన మూడ్ గణేష్ మేయర్, కాంగ్రెస్కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతనంగా ఏర్పడిన కార్పోరేషన్ ఎంతో అభివృద్ధి చెందనుందని హైదరాబాద్ తర్వాత అంతటి విశిష్టత ఇక్కడ ఉందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి మరింతగా జరుగుతుందని, పెద్దపెద్ద కంపెనీలు ఇక్కడికి రావడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ప్రజల ఆర్థిక



స్థితిగతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయని, త్వరలో విమానాశ్రయంతో పాటు, పెద్దపెద్ద పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. రాగద్వేషాలకు, పార్టీలు, వ్యక్తులు, శక్తులకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధికి పాటుపడతామని, సానుకూల దృక్పదంతో ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలపడంతో పాటు ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలికి, మేయర్, డిప్యూటీ మేయర్లకు అభినందనలు తెలిపారు. సుపరిపాలన దిశగా ముందుకు సాగాలని, కార్పోరేషన్ అభివృద్ధే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకుని చక్కటి పాలనను ప్రజలకు అందించాలని కూనంనేని సూచించారు.

# కొలువుతీరిన కార్పోరేషన్ పాలక మండలి

### మేయర్ గా మూడ్ గణేష్ డిప్యూటీ మేయర్ గా లలిత కుమారి
### చెరో రెండున్నరేళ్ల పాలన
### బిఆర్ఎస్ కార్పొరేటర్ల గైర్హాజర్
### ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి సందడిగా మారిన కొత్తగూడెం కార్పొరేషన్




మూడ్ గణేష్ కార్పొరేషన్ మేయర్




లలిత కుమారి డిప్యూటీ మేయర్

**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పోరేషన్ తొలి పాలకవర్గ కొలువుతీరింది. మేయర్ మూడ్ గణేష్ (20వ డివిజన్) డిప్యూటీ మేయర్ గా సిరిపురపు లలితకుమారి (8వ డివిజన్) లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. తొలూత ఆయా డివిజన్ల నుండి గెలుపొందిన వారితో కార్పోరేటర్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావు ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక జరిగింది. సిపిఐ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబా మేయర్ గా మూడ్ గణేష్ను ప్రతిపాదించగా స్వతంత్ర కార్పోరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ బలపరిచారు. డిప్యూటీ మేయర్ సిరిపురవు లలిత కుమారిని కనుకుంట్ల శ్రీనివాస్ ప్రతిపాదించగా బోయిన విజయ్ కుమార్ బలపరిచారు. దీంతో మూడు రోజుల ఉత్కంఠతకు తో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చెరో రెండున్నరేళ్ల పాటు :

అభ్యర్థుల నామినేషన్ల నాటి నుండి ఎన్నికల ఫలితాలు వెలువడి, పదవులు చేపట్టేంత వరకు తీవ్ర ఉత్కంఠ వాతావరణం కార్పోరేషన్ వ్యాప్తంగా నెలకొంది. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు సీట్లు సమానంగా రాగా మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే టెన్షన్ నెలకొంది. కాగా సిపిఐ, కాంగ్రెస్ల అగ్రనాయకత్వం చర్చోపచర్చల అనంతరం ఐదేళ్ల పాలనను చెరో రెండున్నరేళ్ల పాటు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలి రెండున్నరేళ్లు సిపిఐ కు చెందిన మూడ్ గణేష్ మేయర్, కాంగ్రెస్కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్ గా పదువులు చేపట్టారు. మరో రెండున్నరేళ్లు మేయర్గా కాంగ్రెస్, డిప్యూటీ మేయర్ పదవిని సిపిఐ చేపట్టనుంది. దీంతో కొత్తగూడెం తొలి కార్పోరేషన్ పాలక మండలి కొలువుతీరింది. ఇందిలా ఉండగా బిఆర్ఎస్ నుండి గెలిచిన ఎనిమిది మంది కార్పోరేటర్లు గైర్హాజరయ్యారు. కాగా వీరు మరోరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

సమిష్టిగా :

ఇరు పార్టీల అగ్రనాకత్వం ఒప్పందం ప్రకారం సమిష్టిగా కలిసి ముందుకు సాగేందుకు నిర్ణయించుకున్నారు. ఇందు కోసం ప్రమాణస్వీకారానికి ముందుగా ఓ హోటల్లో ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎయిఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పల్లా వెంకటరెడ్డి, భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషాలు కార్పోరేటర్లతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. జరిగిన ఒప్పందాన్ని వారికి వివరించి అదినాయకత్వం మాటే శిరోధార్యమని చెప్పి మేయర్, డిప్యూటీ మేయర్ పేర్లను ప్రకటించారు. అనంతరం ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో దారి పోడవునా సందడి వాతావరణం నెలకొంది. ర్యాలీలో అగ్రభాగాన కూనంనేని నిలవడంతో పెద్ద ఎత్తున అభివాదాలు, నినాదాలు మిన్నంటాయి.

సందడి నందడి :

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయం ఆవరణ సందడిగా మారింది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు మేయర్, డిప్యుటీ మేయర్, కార్పోరేటర్ల బంధువులు, స్నేహితులు, అభిమానులు, సన్నిహితులతో ఆ ప్రాంగణం-జనసంద్రమైంది. ప్రామాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు బయటకు రాగా పెద్దపెట్టున నినానాదలు చేశారు. వారిని కులుసుకుని అభినందనలు తెలిపేందుకు ఎగబడ్డారు.

# రాయికల్ పీఠం దక్కించుకున్న బిఆర్ఎస్ చైర్మన్ గా కట్కం రవీందర్ , వైస్ చైర్ పర్సన్ గా తురగ సౌజన్య.

**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 16(వార్త సంధ్య) :** జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ ఎన్నికలు బీజేపీ ఐదు వార్డులు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచినా.. బీఆర్ఎస్(3), కాంగ్రెస్ (3), స్వతంత్ర (1) సభ్యుల కూటమి మెజారిటీ సాధించి పాలక మండలిని తమ ఆధీనంలోకి తీసుకుంది. దీంతో రాయికల్ మున్సిపల్పై బీఆర్ఎస్ జెండా ఎగిరింది. మున్సిపల్ కార్యాలయంలో ఎలక్షన్ ప్రత్యేక అధికారి గౌతమ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగార్జున, ఎలక్షన్ జోన్ ఇంచార్జ్ అభయ రాజు కౌన్సిలర్ సబ్బులచే ప్రమాణ స్వీకారం చేయించి అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పదవికి బీఆర్ఎస్ తరఫున రెండవ వార్డు కౌన్సిలర్ కట్కం రవీందర్ను ప్రతిపాదించారు. నాల్గవ వార్డు కౌన్సిలర్ తురగ సౌజన్య ప్రతిపాదించగా.. ఏడవ వార్డు కౌన్సిలర్ ఎలిగేటి లతిక బలపరిచారు. బీజేపీ తరఫున 12వ వార్డు కౌన్సిలర్ కల్లెడ ధర్మపురిని కూనారపు మానస ప్రతిపాదించగా.. తోపరపు ప్రశాంతి బలపరిచారు. వైస్ చైర్మన్ పదవికి బీఆర్ఎస్ నుంచి నాల్గవ వార్డు




కౌన్సిలర్ తురగ సౌజన్యను ప్రతిపాదించగా.. ఎలిగేటి లతిక బలపరిచారు. బీజేపీ తరఫున 11వ వార్డు కౌన్సిలర్ పుర్రె శ్రీధర్ను తోపరపు ప్రశాంతి ప్రతిపాదించగా.. వేముల మౌనిక బలపరిచారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్, స్వతంత్ర కౌన్సిలర్లు బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం కీలకంగా మారింది. అనంతరం బీఆర్ఎస్కు లభించడంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఖరారయ్యాయి. తదనంతరం జరిగిన కార్యక్రమంలో కట్కం రవీందర్ మున్సిపల్ చైర్మన్గా, తురగ సౌజన్య వైస్ చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కట్కం రవీందర్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి, పారిశుధ్య సమస్యల పరిష్కారం, తాగునీటి సరఫరా, రహదారుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కూటమి సహకారంతో పారదర్శక పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిణామాలతో రాయికల్ పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడ్డాయి. ఇకపై కూటమి సమన్వయం, అభివృద్ధి పనుల అమలుపై పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా రూరల్ సిఐ సుధాకర్, రాయికల్ ఎస్ఐ సుధీర్ రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక



## ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాం

**ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో అభివృద్ధి ఉరకలు వేయిస్తాం**

**ఘనవిజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు**

**పార్టీ శ్రేణులు, అభిమానుల శ్రమ అభినందనీయం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**కొత్తగూడెం ప్రతినిధి ఫిబ్రవరి 16 (వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్'కు తొలిసారి జరిగిన ఎన్నికల్లో సిపిఐకి ఘనవిజయాన్ని అందించిన ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మేయర్, కార్పొరేటర్ల పనితీరు ఉంటుందని, అందుకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ తనవంతు పాత్ర పోషిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. సోమవారం జరిగిన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం అయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని కృషి, ప్రత్యేక శ్రద్ధతో కార్పొరేషన్'ను సాధించుకున్నామని, కేంద్రం నుంచి, రాష్ట్రము నుంచి అత్యధిక నిధులు రాబట్టి కార్పొరేషన్'ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతుందని, గెలుపు, ఓటమిల అంశాన్ని ఎన్నికలవరకే పరిమితం చేసి, పార్టీలకతీతంగా అభివృద్ధి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. కూనంనేని సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధిని ఉరకలు వేయిస్తామని తెలిపారు. కార్పొరేషన్ మేయర్ భాధ్యతను కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి చేపట్టడం గర్వించదగ్గ విషయమని, మరింత బాధ్యతతో పని చేస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో 23 కార్పొరేటర్ స్తనాలు అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మేయరుగా బాధ్యతలు చేపట్టిన మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారికి, బాధ్యతలు చేపట్టిన కార్పొరేటర్లకు అయన శుభాకాంక్షలు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల విజయంకోసం శ్రమించిన పార్టీ, ప్రజాసంఘాలు, అభిమానులకు అయన అభినందనలు తెలిపారు.

## ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో 21వ రోజు డ్రగ్స్ పై దండయాత్ర

**మహిళా పోలీసుల సైకిల్ యాత్రకు ఘన స్వాగతం**



**తిరువూరు ఫిబ్రవరి 16 (వార్తసంధ్య ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాలనే సంకల్పంతో చీ= జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డ్రగ్స్‌పై దండయాత్ర" కార్యక్రమం 21వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా తిరువూరులో మహిళా పోలీసులు చేపట్టిన సైకిల్ యాత్ర పట్టణ ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ దండయాత్ర జిల్లా వ్యాప్తంగా మొత్తం 510 కిలోమీటర్ల మేర సాగనుండగా, ఇప్పటికే సుమారు 300 కిలోమీటర్ల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో యువతకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, కుటుంబాల్లో చైతన్యం పెంపొందించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. తిరువూరులో నిర్వహించిన సైకిల్ ర్యాలీ వాహిని కాలేజీ వద్ద ప్రారంభమై సుందరయ్య కాలనీ, పాతూరు మునుకుళ్ల రోడ్, తాంగెళ్లభీడు, కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ రోడ్, చీరాల సెంటర్, బస్టాండ్ మీదుగా ఎంఆర్ఓ కార్యాలయం, చివరగా పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. మార్గమధ్యంలో విద్యార్థులు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు మహిళా పోలీసులకు పూలమాలలతో స్వాగతం పలికి తమ మద్దతును తెలియజేశారు. వాహిని కాలేజీ విద్యార్థులు, గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ యాత్రలో చురుకుగా పాల్గొని "డ్రగ్స్‌కు నో చెప్పండి ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మించండి" అనే నినాదాలతో పట్టణాన్ని మార్మోగించారు. యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం సమాజానికి ఎంత ప్రమాదకరమో వివరించుతూ పోలీసులు అవగాహన ప్రసంగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, డ్రగ్స్ వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం గమనించిన పక్షంలో ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. యువత సానుకూల దారిలో ముందుకు సాగేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజ నాయకులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తిరువూరు వాహిని కాలేజీ విద్యార్థులు, గురుకుల పాఠశాల విద్యార్థులు, స్థానిక ప్రజలు మరియు ప్రజా సంఘాలకు పోలీస్ డిపార్ట్మెంట్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ దండయాత్ర కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## గుడికోట లో రథోత్సవం



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 16 (వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆఖరి ఘట్టమైన శివపార్వతుల రథోత్సవం కనుల పండుగ సాగింది. ఆదివారం ఆలయ కమిటీ మరియు ప్రధాన అర్చకులు మంగోలి సతీష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు మునుగోటి రమేష్ శర్మ శివపార్వతుల కళ్యాణం, అభిషేకం మరియు స్వామివారికి బిల్వార్చన తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రోజున స్వామి వారి దర్శనం,రథోత్సవం డప్పు చప్పుల్లు మరియు మంగళవారం వాయిధ్యాలు మధ్యన కన్నుల పండుగ సాగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మంతెన మహేందర్, కోశాధికారి సాంబారు శ్రీనివాస్ లతోపాటు ఆలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల దాహార్తికి శాశ్వత పరిష్కారం - తిరువూరు బస్టాండ్ లో నీటి శుద్ధి యంత్రం

**శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు చే ఘనంగా ప్రారంభం**



**తిరువూరు ఫిబ్రవరి 16 (వార్తసంధ్య) :** ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం, తిరువూరు పట్టణంలోని (ఏపీఎస్ ఆర్టీసీ) బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ మరియు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో ప్రయాణికులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ బస్టాండ్‌లో శుద్ధి చేసిన త్రాగునీరు అందుబాటులో ఉండటం ప్రయాణికులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. సిబ్బందికి కూడా ఈ సదుపాయం ఉపయోగపడనుంది.ఈ వాటర్ ప్లాంట్‌ను కీ.శే. నూతక్కి వెంకట రామారావు స్మారకార్థం ఆయన కుమారులు నూతక్కి వెంకట రమేష్ బాబు, నూతక్కి వేణు గోపాలరావు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. ప్రారంభోత్సవం అనంతరం మహిళా ప్రయాణికుల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు తీరు గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ. సుబ్రహ్మణ్యం, ఆర్టీసీ సిబ్బంది, పట్టణ కూటమి పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా తిరువూరులో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఇది మరో ముఖ్యమైన అడుగుగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## పెంబట్ల దుబ్బా రాజన్న సన్నిధిలో భక్తులకు చల్లని ఊరట






**సారంగాపూర్ మండలం వార్త సంధ్య ఫిబ్రవరి 16 :** మాసర్థి మల్లయ్య, ముల్గునూరి గణేష్ ఆధ్వర్యంలో ఉచిత చలివేంద్రం పెంబట్ల మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ దుబ్బా రాజేశ్వర స్వామి (దుబ్బా రాజన్న ఆలయం) భక్తజన సంద్రమైంది. శివయ్యను దర్శించుకునేందుకు కిలోమీటర్ల మేర క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం మాసర్థి మల్లయ్య , ముల్గునూరి గణేష్ విశేష సేవా కార్యక్రమాలు చేపట్టారు.మహాశివరాత్రి వేడుకలు: శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పెంబట్ల గ్రామం శివనామస్మరణతో మారుమోగింది.ఉచిత తాగునీటి సరఫరా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, భక్తులు దాహార్తితో ఇబ్బంది పడకుండా మాసర్థి మల్లయ్య , ముల్గునూరి గణేష్ స్వచ్ఛందంగా ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.నిరంతర సేవ ఆలయ పరిసరాల్లో క్యూలైన్లలో ఉన్న భక్తులకు స్వయంగా గ్లాసులతో తాగునీరు అందిస్తూ, తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. భక్తుల హర్షం: భక్తుల అవసరాలను గుర్తించి, సమయానికి చల్లని నీరు అందించడం పట్ల యాత్రికులు , స్థానికులు వారిని అభినందించారు.ఈ సందర్భంగా మాసర్థి మల్లయ్య , ముల్గునూరి గణేష్ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం విషాన్ని సేవించిన ఆ పరమశివుని భక్తులకు సేవ చేయడం తమ పూర్వజన్మ సుకృతమని, ప్రతి ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## రాజుపేటలో చరిత్రాత్మక ఘట్టం "మస్జిద్ ఏ అరిఫ్ కమ్యూనిటీ హాల్" ఘన ప్రారంభం

**మైనారిటీల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన వేడుకలో ఎమ్మెల్యే కొలికపూడి**



**తిరువూరు ఫిబ్రవరి 16 (వార్త సంధ్య) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలోని రాజుపేటలో ముస్లిం సోదరుల చిరకాల స్వప్నమైన "మస్జిద్ ఏ అరిఫ్ కమ్యూనిటీ హాల్" ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై హాల్‌ను ప్రారంభించారు. రాజుపేటలో నిర్మించిన ఈ కమ్యూనిటీ హాల్‌ను వ్యక్తిగత నిధులతో, అనేక అడ్డంకులను అధిగమిస్తూ, అనుకున్న సమయం కంటే ముందుగానే అన్ని సౌకర్యాలతో పూర్తి చేయడం విశేషం. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆబిదా ఆప గారికి ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమాజ సేవలో అంకితభావంతో ముందుండి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముస్లిం మైనారిటీ ప్రజల విద్య, వైద్యం మరియు ఇతర అవసరాల కోసం తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, పెద్దలు, మహిళలు, యువతతో పాటు కూటమి పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మంథని మున్సిపల్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



**మంథని, ఫిబ్రవరి 16 (వార్త సంఖ్య) :** మంథని పట్టణంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్ల పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు. అనంతరం సోమవారం నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ర్యాలీలో భాగంగా స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ శ్రీపాద రావు విగ్రహానికి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు మంథని ప్రాంతాన్ని రాష్ట్రంలోనే అత్యున్నత హంగులతో అభివృద్ధి పథంలో తీసుకెళ్తారని నమ్మకంతో ప్రజలు మంథని మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం జరిగిందనీ అన్నారు .ఈ విజయానికి అహర్నిశలు కృషి చేసిన నాయకులకు, ప్రతి కార్యకర్తకు మరియు మంథని మున్సిపల్ ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## పరమశివుని దివ్య ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలి మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 16, వార్త సంధ్య :** జిల్లా పరిధిలోని,మహాశివరాత్రి సందర్భంగా మంటాడ శివాల యంలో వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని , స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన రాజేంద్రప్రసాద్,ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ. ముల్లోకా లను ఏలేటువంటి ముక్కంటి పరమశివుడు అని, రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు అన్ని శివాలయాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారని, ప్రభుత్వం కూడా అన్ని శివాలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిందని పరమశివుని ఆశీస్సులతో మనమందరం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్, తెదేపా నాయకులు రత్నం బుజ్జి, గుర్రాల సాయి తదితరులు పాల్గొన్నారు

## మహా శివరాత్రి వేళ తిరువూరు ప్రజల కోసం ప్రత్యేక ప్రార్థనలు

**ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్యాత్మిక సంకల్పం**



**తిరువూరు ఫిబ్రవరి 16 (వార్తసంధ్య) :** యన్ టీ ఆర్ జిల్లా తిరువూరు మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలంగాణ రాష్ట్రంలోని నీలాద్రి అటవీ ప్రాంతంలో వెలసిన శివాలయాన్ని దర్శించారు. నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి తిరువూరులో నెలకొన్న పలు సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని పరమేశ్వరుని ప్రార్థించారు. రైతులు సమృద్ధిగా పంటలు పండించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంతో ఆనందంగా జీవించాలని ఆయన సంకల్పం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలు మరింత ఫలప్రదంగా మారాలని, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలకు పనితీరుతోనే సమాధానం ఇస్తానని, తిరువూరు అభివృద్ధే తన ధ్యేయమని స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ప్రజల క్షేమం కోసం చేసిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే చేసిన ఈ ప్రత్యేక పూజలు తిరువూరు ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకితభావానికి నిదర్శనంగా నిలిచాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

పాల్గొన్న 3వ పట్టణ సిఐ ఇంద్రసేనారెడ్డి




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య):** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్‌లో సోమవారం ఆటో డ్రైవర్లు, యువత కోసం యాంటీ డ్రగ్స్ మరియు ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 3వ పట్టణ సిఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ "డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ" లక్ష్యంతో ప్రభుత్వం, పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయని, యువత డ్రగ్స్ పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని, వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన ఆరోగ్యపరమైన నష్టాలతో పాటు ఆర్థిక ఇబ్బందులు, సామాజిక గౌరవ హాని కలుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి వాహనదారుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం వలన కలిగే ప్రమాదాలను వివరించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు విజయలక్ష్మి, బెగ్, ఏఎస్ఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల తదితరులు పాల్గొన్నారు.

## కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ గా అబ్బిన వీర వెంకటరావు

**ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన వెంకట్రావు**

**తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య) :** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొమ్ముగూడెం సొసైటీ అధ్యక్షునిగా తెలుగుదేశం పార్టీ నాయకులు అబ్బిన వీర వెంకట్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా సోమవారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మర్యాదపూర్వకంగా బొలిశెట్టి శ్రీనివాస్ ని కలిశారు అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ వెంకట్రావుకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వెంకట్రావు ఎమ్మెల్యే శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలుపుతూ దుస్సాలువ పూల బొకేతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక ప్రజల ఋణం తీర్చుకోలేనిది ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 16(వార్త సంధ్య ):** సిద్దిపేట జిల్లా దుబ్బాక కష్టకాలంలో అండగా నిలిచిన దుబ్బాక ప్రజల ఋణం తీర్చుకోలేనిదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ తరపున చైర్మన్‌గా శ్రీ రాం సంగీత రవీందర్, వైస్ చైర్మన్‌గా అస సులోచన స్వామి పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులను కూడా సత్కరించారు. అధికారంలో లేకున్నా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచిన దుబ్బాక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల విజయానికి సహకరించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, వార్డు ఇంచార్జీలు మరియు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కెసిఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని, మున్సిపల్ ఎన్నికల్లో అది మరోసారి నిరూపితమైందన్నారు. ఎన్నికలు ముగిశాయని, ఇక రాజకీయాలు పక్కన పెట్టి దుబ్బాక పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, చైర్మన్ శ్రీ రాం సంగీత రవీందర్ మరియు వైస్ చైర్మన్ అస సులోచన స్వామి మాట్లాడుతూ, తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారికి, కౌన్సిలర్లకు మరియు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.దుబ్బాక పట్టణ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఎస్సీ/ ఎస్టీ గృహాలకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన వెలుగులు

**ఎస్సీ, ఎస్టీ గృహాలకు నూరు శాతం సబ్సిడీతో సోలార్ ప్యానల్స్ అమరిక**

**ఒక్కొక్క కుటుంబానికి నూరు శాతం ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లింపు**

**రూ.1.20 లక్షలు కాగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.60 వేలు**

**తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పథకం అమలుకు ఏప్రిల్ 13, 2026 ఉంది**

**ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు నూరు శాతం రాయితో పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానల్స్ అమరిక పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**





**తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 16 ( వార్త సంధ్య) :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల గృహాలలో విద్యుత్ వెలుగులు నింపేందుకు పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద ఉచితంగా సోలార్ ప్యానల్స్ అమరికకు సంకల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎస్సీ ఎస్సీ వర్గాల గృహాలకు పీఎం సూర్య ఘర్ పథకం కింద నూరు శాతం సబ్సిడీతో అమలు చేస్తున్న సోలార్ ప్యానల్స్ అమరిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలో మొట్టమొదటిగా తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, దీనిలో భాగంగా పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా మరొక సంక్షేమాన్ని నూరు శాతం సబ్సిడీతో అందించడానికి రాష్ట్రవ్యాప్తంగా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో మొట్టమొదటిగా నేడు నీలాద్రిపురంలో ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మన ముఖ్యమంత్రికి టెక్నాలజీ అంటే చాలా ఇష్టము అని, టెక్నాలజీ గ్రామాలకు కూడా అందించే లక్ష్యంతో ఈ విధంగా సోలార్ ప్యానల్స్ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు అందరికీ చేరవేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ఒకటిన్నర సంవత్సరంగా జిల్లాలో ఉన్న కుటుంబాలకి సబ్సిడీపై సోలార్ ఎనర్జీని పియం సూర్య ఘర్ ద్వారా ప్రతి ఇంటికి సబ్సిడీతో ప్యానల్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నా అన్నారు. వారు వినియోగించుకున్న విద్యుత్ పోను గ్రిడ్ కు అందించిన దానికి మిగిలిన మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేయడం కూడా జరుగుతుందన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో మన జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 5 వేల గృహాలకు మాత్రమే కనెక్షన్లను ఇవ్వడం జరిగింది అన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు నూరు శాతం సబ్సిడీపై ఈ ప్రాజెక్ట్ అమలులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో తొలి విడతలో సుమారు 22,855 ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు రూ.260.18 కోట్ల రూపాయలు విలువ కలిగిన 2 కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ అమర్చడం జరుగుతుందని తెలిపారు. 60 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ద్వారా సబ్సిడీ అందిస్తున్నదని, మిగిలిన మొత్తం ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వడం జరుగుతుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 8,403 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాల లబ్ధిదారులను గుర్తించడం జరిగిందని, వీరిలో తొలి విడతగా 3,273 కుటుంబాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 6,546 కుటుంబాలకు దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎంత పని చేసినా అధికారులు దాన్ని అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని, నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ సహకారం ఎంతో విలువైనదని కొనియాడారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు రూ.1.80 లక్షల విలువైన సోలార్ ప్యానల్స్ ను నూరు శాతం సబ్సిడీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు కరెంట్ ను కొనుక్కోకుండా సోలార్ ప్యానల్స్ ఉచితంగా అందించడంతో ఉచిత విద్యుత్తును పొందగలుగుతారు అన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఎస్సీ, ఎస్టీ సోదరులు పట్ల ఉన్నటువంటి అభిమానాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సోదరులకు ఉన్నటువంటి విదేశీ అంబేద్కర్ విద్యను, ఎస్సీ,ఎస్టీ సబ్సిడీ లోన్స్ అందించకపోయిన నేడు కూటమి ప్రభుత్వం అందించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ, మిమ్మల్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచనతో ఒక్కొక్క లబ్ధిదారులకు రూ.1.20 ఖర్చుచేసి ఈ పథకాన్ని అమలు చేయడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. అలాగే బడ్జెట్ కేటాయింపుల్లో కూడా బడుగు బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ఆర్డిఓ ఖతిబ్ కౌసర్ భానో, టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకాశం స్వామి, తహసిల్దార్ రాజరాజేశ్వరి, సర్పంచ్ లక్ష్మణరావు, జడ్పిటిసి ఆంజనేయులు, ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ శేషు లత, కూటమి నాయకులు ఈతకోట తాతాజీ, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పసల కొండ, సాలూరు వెంకటేశ్వరరావు, కే రామారావు, తదితర స్థానిక నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహ నిర్మూలనకు ప్రచార రథం.

**జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన తాసిల్దార్ లంకపల్లి వీరభద్రం.**





టేకులపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 16 (వార్త సంధ్య): టేకులపల్లి :యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో బాల్యవివాహాల మీద అవగాహన కోసం ప్రచార రథాన్ని టేకుల పల్లి తాసిల్దార్ లంకపల్లి వీరభద్రం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి తహ సిల్దార్, ఎస్సై రాజేందర్, సూపర్డెంట్ శ్రీనివాసరావు లు పాల్గొని మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, మరియు ఆశ వర్కర్లు పాల్గొని బాల్యవివాహాల మీద అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు.బాల్య వివాహం చట్టాలు చాలా కఠిన కఠిన తరంగా ఉంటాయని బాల్యవివాహాలు ప్రోత్సహించిన వారికి సహకరించిన వారికి దానిలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. అవగాహన కల్పించడం కోసం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ మరియు ఎయి డ్ సంస్థ సహకారంతో ఈ ప్రచార రథాన్ని కొనసాగించటం నియోజకవర్గ ప్రజలకు అవగాహన కల్పిం చడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. చిన్న వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడం వలన హార్మోన్స్ డెవలప్ కాకపోవడం వలన పుట్టే పిల్లలు అంగవైకల్యంతో పుడతారని, వారికి రక్తహీనత లోపాలు వస్తా యని మరియు శరీర సంబంధమైన వ్యాధులు త్వరగా సంక్రమించే అవకాశం ఉంది కనుక ఆడ పిల్లలకి త్వరగా పెళ్లిళ్లు చేయొద్దని తెలిపారు. 18 సంవత్సరాలలోపు ఆడపిల్లకి 21 సంవత్సరాలలోపు మగ వ్యక్తికి పెళ్లిళ్లు చేయడం నేరమని చట్టపరిధిలోకి వస్తారని అలాగే ఆడపిల్లలకి భవిష్యత్తు పరంగా అభి వృద్ధి చెందడం ఉండదని చదువులకు దూరం అవుతారని ఈరోజు వాళ్ళనే రేపటి పౌరులు కనుక దేశాన్ని ముం దుకు నడిపించే బాధ్యత వాళ్ల మీద ఉన్నది కనుక చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేసి వాళ్ళ జీవితం అనర్థా లకు గురి చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ జిల్లా కోఆర్డి నేటర్ రాజేష్, కమ్యూనిటీ సోషల్ మొబలైజర్స్ మోహన్, మాన్సింగ్, జ్యోతి ,మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

## తంగడపల్లి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం అన్నదానం

**శ్రవణ నక్షత్రంలో 105 కలశాలతో అభిషేకం సహస్రనామ అర్చన**




**చేవెళ్ల ఫిబ్రవరి 16 వార్త సంధ్య ):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, తంగడపల్లిలో సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర మాఘమాస బహుళ అమావాస్య సందర్భంగా శ్రవణ నక్షత్రంలో శ్రీ దశావతార సహిత శ్రీ లక్ష్మీ అలమేలుమంగా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి 105వ నవకలశ స్నపన తిరుమంజనం (అభిషేకం) భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పాలు, పెరుగు, తేనె, చందనం, పుష్పాలతో స్వామివారికి నిర్వహించిన అభిషేకం ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. అనంతరం సహస్రనామ అర్చనను విశేషంగా నిర్వహించగా భక్తులు స్వామివారి సన్నిధిలో కూర్చొని హరినామ స్మరణలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, హారతులతో ఆలయ ప్రాంగణం ఉదయం నుంచే భక్తులతో నిండిపోయింది. గ్రామంలోని వృద్ధులు, మహిళలు, యువతతో పాటు చిన్నారులు కూడా సంప్రదాయ దుస్తుల్లో హాజరై స్వామివారి దర్శనం చేసుకోవడం గ్రామీణ భక్తి వాతావరణాన్ని ప్రతిబింబించింది. కొందరు భక్తులు మొక్కులు తీర్చుకోగా, మరికొందరు కుటుంబ సమేతంగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం చుట్టూ భజనలు, గోవింద నామస్మరణలు మార్మోగుతూ ఆ ప్రాంతమంతా తిరుమల క్షేత్రాన్ని తలపించేలా మారింది. ఈ శుభసందర్భంగా గొల్లగూడెంకు చెందిన సుధీర్ రెడ్డి (స్వర్గీయ బాగిరెడ్డి కుమారుడు) స్వామివారికి అభిషేక సేవను సమర్పించి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రసాదం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిలో గ్రామస్తులు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు క్రమపద్ధతిలో కూర్చొని ప్రసాదాన్ని స్వీకరించడం విశేషంగా నిలిచింది. సేవా కార్యక్రమంలో గ్రామ యువకులు, మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని వడ్డనలు చేయడం గ్రామీణ ఐక్యతను చాటింది. తంగడపల్లి వంటి గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి పరంపర కొనసాగుతోందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఆలయం గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండి ప్రతి పండుగ, ప్రతి శుభకార్యానికి ఆధ్యాత్మిక దిక్సూచి గా నిలుస్తోందని వారు తెలిపారు. భక్తి, సేవా భావం, సామూహిక సహకారం కలిసిన ఈ మహోత్సవం తంగడపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపతో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని భక్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో

## ప్రజాకర్షణలో మోడీ తర్వాత జగనే

**గూడెంలో కూటమికి గుబులు**

**వైసీపీ ఇన్చార్జి వడ్డి రఘురామ్ నాయుడు**




**తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 16 (వార్త సంధ్య) :** భారతదేశంలో అత్యధిక ప్రజాధరణ కలిగిన నాయకుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి అని తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని సవిత్రుపేటలో గల పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా అత్యధిక ప్రజాకర్షణ కలిగిన నాయకులు ఎవరు అనే అంశంపై జరిగిన సర్వేలో ప్రధాని మోడీ తర్వాత మాజీ సీఎం జగనే ఉన్నారన్నారు. అంతటి ప్రజాకర్షణ కలిగిన నాయకుడు జగన్ ను ఉద్దేశించి ఇక్కడి కూటమి నాయకులు ఏక వచనంతో మాట్లాడడం తగదని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన డాక్టర్ వై.యస్.రాజశేఖర్ రెడ్డి కుమారుడిగా, ఒకసారి తానే స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిన వై.యస్.జగన్మోహన్ రెడ్డిని మర్యాదతో మాట్లాడవలసిన అవసరం ఉందన్నారు. ఇకమీదట కూటమి నాయకులు తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని వడ్డి హెచ్చరించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో తాను ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించాక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి ప్రజల్లో ఆదరణ పెరగడంతో పాటు, పార్టీ దూకుడు పెంచడంతో కూటమిలో గుబులు పుడుతుంది అన్నారు. కూటమిలో అసంతృప్తిగా ఉన్న నాయకులు వైసిపి వైపు రావడానికి మొగ్గు చూపిస్తున్నారన్నారు. అంతే కాకుండా తాను ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఇక్కడ నియోజకవర్గ వైసిపి నాయకత్వ తీరుపై విసుగు చెంది జనసేన తదితర కూటమి పార్టీలలో చేరిన వారు తాను ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించడంతో తిరిగి వైసీపీలోకి రావడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. దీంతో కూటమిలో గుబులు పుట్టిందన్నారు. వారంతా తిరిగి మళ్లీ ఎక్కడ వైసీపీ లోకి వెళ్లిపోతారనే ఆందోళనతో కూటమి నాయకత్వం ప్రతిరోజు వారితో మాట్లాడుతూ ఎంతో గౌరవం ఇస్తుందన్నారు. గతంలో తమ పార్టీలో ఉన్నవారు ఇప్పుడు అక్కడ ఉన్నప్పటికీ వారికి అంతటి గౌరవం లభించడం ఒకరకంగా ప్రస్తుత వైసిపి నియోజకవర్గ నాయకత్వం గొప్పతనంగానే తాము భావిస్తున్నామన్నారు. రాజకీయాలలో నైతిక విలువలు లేకపోతే ప్రజల నుంచి చీత్కారాలు ఎదుర్కోక తప్పదు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో కూటమికి ఆదరణ తగ్గినట్లు సర్వేలలో వెల్లడి అవుతుందన్నారు. అలాగే రాయలసీమ ప్రాంతంలోను కూటమి బలహీనపడి వైసిపి బలపడుతున్న సంకేతాలు బలంగా వస్తున్నాయన్నారు. ఇటీవల స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో జరిపిన సమీక్షలో రాయలసీమలో బలపడవలసిన అవసరం ఉందని చెప్పడమే దీనికి తార్కానమన్నారు. అలాగే కోస్తా ఆంధ్ర లోను కూటమికి ఆదరణ క్రమేపీ తగ్గుతుంది అన్నారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు తిరగకుండానే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి మరోసారి వై.యస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని వైసిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి వడ్డి రఘురామ్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పెంటపాడు జెడ్పీటీసీ వరలక్ష్మి, ఎంపీపీ పి.శేషులత, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, ఏపీ స్టేట్ వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, వైసీపీ సీనియర్ నాయకులు మాకరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బసవన్నకు మేత పెట్టనిదే ఫైల్ కదలదు

**నందిగామ మున్సిపల్ కార్యాలయంలో అక్రమ దందా**

**ఔట్ సోర్సింగ్ ఉద్యోగి హవా**



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 16 వార్త సంధ్య :** జిల్లా పరిధిలోని,నందిగామ పురపాలక సంఘం కార్యాలయంలో రెవిన్యూ ఉద్యోగుల మధ్య ఆదిపత్య ధోరణి వింత గొలుపుతుంది. కార్యాలయ రెవిన్యూ ఉద్యోగుల మధ్య ఔట్సోర్సింగ్ ఉద్యోగి విధులు తీవ్ర దుమారం రేపుతోంది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పురపాలక సంఘం కమిషనర్ జయరామ్ ఆదేశాలతో ఔట్సోర్సింగ్ ఉద్యోగి బసవన్న టౌన్ ప్లానింగ్ సెక్షన్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్నాడు. ఆ తరువాత పరిణామాలలో బసవన్న కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పుడప్పుడు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో అదనపు డ్రైవర్ గా పనిచేశాడు. దీన్ని ఆసరాగా తీసుకున్న బసవన్న ఇటీవల సచివాలయ ఉద్యోగుల బదిలీలలో ఏకంగా తాను ఏ పనైనా చేపిస్తానని వేలు పెట్టాడు. దీంతో ఆ విషయంపై పట్టణ పార్టీ అధ్యక్షుడి ఆగ్రహాన్ని గురయ్యాడు. అనంతరం యధావిధిగా అవుట్సోర్సింగ్ ఉద్యోగిగా పురపాలక సంఘం కార్యాలయంలోని ఏదో సెక్షన్ లో పనిచేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కార్యాలయం ఉద్యోగి కి సన్నిహితంగా ఉంటూ ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న మరో ఔట్సోర్సింగ్ ఉద్యోగి కి ఎసరుపెట్టే ప్రయత్నం ప్రారంభించాడు.దీనికి కార్యాలయం ముఖ్య వ్యక్తి సహకారం ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో రెచ్చిపోయిన సదరు బసవన్న ఏకంగా పురపాలక సంఘం కార్యాలయం ఆర్ఐని కాదని ఏకంగా ఆ కార్యాలయ ముఖ్య ఉద్యోగి వద్ద ప్రతిదీ తానై ఉద్యోగం నిర్వహిస్తూ నూతన పన్ను కట్టించుకునే వారి వద్ద చేతివాటం ప్రదర్శించడం నేర్చుకున్నాడు. దీనికి తోడు తనను పురపాలక సంఘం కార్యాలయంలో ఎవరు ఏమీ చేయలేరని తనకు ఎదురే లేదని కొంతమంది వ్యక్తుల దగ్గర ప్రగల్భాలు పలుకుతున్నట్లు సమాచారం. దీంతో రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం ఏర్పడి పురపాలక సంఘానికి రావలసిన రెవెన్యూ పక్కదారి పడుతుందని తెలుస్తుంది. ఒక నూతన గృహానికి ఇంటి పన్ను నిర్ధారించాలంటే పురపాలక సంఘ కార్యాలయంలోని ఆర్ఐ మరియు ఆర్ఐ పైన ఉన్న ఒక ముఖ్య అధికారి సమన్వయం చేసుకుని ఫిల్డ్ పరిశీలించి ఇంటి పన్ను నిర్ధారించవలసి ఉంది. ఈ పనిని కేవలం ఔట్సోర్సింగ్ ఉద్యోగి అన్ని తానై ఎవరికి సమాధానం చెప్పే పని లేదంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. అలాగే ఈ ఔట్సోర్సింగ్ ఉద్యోగి పట్నంలోని పలు ప్రాంతాలలో నిర్మించిన అక్రమ భవనాలకు సైతం పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శించి ఇంటి పనులను నమోదు చేయించి ఇచ్చినట్లు సమాచారం.




మిగతా భాగం తరువాత..

# తూకాల్లో 'అర'గదీస్తూ, మోసాల్లో ఇరగదీస్తూ

**భారీగా సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు**

**వినియోగదారుల అవగాహన రాహిత్యాన్ని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు**

**ఎమ్మార్పీకి మించి అడ్డగోలుగా అమ్మేస్తున్న వైనం**

**అరకొర తనిఖీలతో మమ అనిపిస్తోన్న తూనికలు కొలతల శాఖ**




వినియోగదారుల అవగాహన రాహిత్యాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బ్రాండెడ్ వస్తువుల పేరుతో నకిలీవి అంటగడుతున్నారు. ఎమ్మార్పీకి మించి అడ్డగోలుగా అమ్మేస్తున్నారు. అంతేగాక తప్పుడు తరాజులతో బురిడీ కొట్టించి జేబులు నింపుకొంటున్నారు. రాష్ట్రంలో ఇంతజరుగుతున్నా తూనికలు కొలతల శాఖ అధికారులు మాత్రం అరకొర తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. ఇప్పటివరకు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైనుకు వచ్చిన ఫిర్యాదులు తప్ప బంగారం దుకాణాలు, పెట్రోలు బంకులు, ఇతరు వ్యాపార సంస్థల్లో అసలు తనిఖీలే ఉండటం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 28 మంది సిబ్బంది అవసరం ఉన్నా కేవలం 12 మందే పని చేస్తున్నారు. మోసాలు ఎలా గుర్తించాలో ప్రజల్లో అవగాహన కల్పించడం లేదు. చివరికి మోసం జరిగితే అసలు ఎవరికి ఫిర్యాదు చేయాలన్న కనీస పరిజ్ఞానం సైతం ఉండటం లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 831 కేసులు నమోదు కాగా రూ.58.7 లక్షల జరిమానాను వ్యాపారులకు విధించారు. అలాగే కృష్ణాజిల్లాలో 749 కేసులు నమోదు చేసిన దాదాపు 35.6 లక్షల రుపాయాలను వ్యాపారులకు అధికారులు జరిమానా విధించారు. కొలతల్లో మోసాలు, తేడాలపై వినియోగదారులు 1917 నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన తూనికలు కొలతలశాఖ ఉప నియంత్రికులు బి. సాయిరామ్ స్పష్టం చేశారు.

**ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొన్ని ఘటనలు :**

శామ్‌సంగ్ కంపెనీ తయారీనే నిలిపేసినా : పోరంకికి చెందిన రాజేశ్ ఓ ఫోన్ కొనేందుకు విజయవాడలో ఉన్న ఎన్టీఆర్ కాంప్లెక్స్‌కి వెళ్లారు. శామ్‌సంగ్ కంపెనీ తయారీనే నిలిపేసిన గురు ఫోన్ ఇప్పటికీ అక్కడ దొరుకుతుంది. ఏకంగా రూ.1700 తీసుకుని రాజేశ్‌కు నకిలీ ఫోన్‌ను ఇచ్చారు. ఆ ఫోన్‌కు ఎటువంటి బిల్లు, గ్యారెంటీ, వారంటీ లేదు. ఫోన్లు, ఇయర్‌ఫోన్లు, బడ్స్, ఛార్జర్లు అన్ని ఇక్కడ దొరుకుతాయి. బ్రాండ్ వస్తువుల్లా ఉండే నకిలీ వస్తువులను మాయ చేసి వినియోగదారులకు అమ్మేసి జేబులు నింపుకుంటున్నారు. 103 గ్రాములు తక్కువ తూకం : అర్జునరావు కానూరులోని మాంసం దుకాణంలో 1న్నర మటన్ కొన్నారు. అక్కడి దుకాణంలో మాత్రం తూకం వేసినప్పుడు 1న్నరకి 7 గ్రాములు ఎక్కువే చూపించింది. కొద్దిసేపటికి తూకంపై అనుమానం కలిగిన అర్జునరావు రైతుబజార్‌లోని మార్కెటింగ్‌శాఖలో తూకం వేస్తే అప్పుడు 897 గ్రాములే వచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న 50శాతం పైగా దుకాణాల్లో ఇలాంటి నిలువు దోపిడీలే సాగుతున్నాయి. అంతేగాక ఎలక్ట్రికల్ కాటాల్లో కేజీల మోడ్‌ను లీటర్లుగా మార్చి వినియోగదారులను ఏమారుస్తున్నారు.

**రూ.10 సీసా ఏకంగా రూ.15కు :** మరోవైపు ఆటోనగర్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ శీతల పానీయాల దుకాణంలో రూ.10 అమ్మల్సిన సీసాను ఏకంగా రూ.15 అమ్ముతున్నారు. అంటే కంపెనీ ఇచ్చే మార్జిన్ కంటే రూ.50శాతం అదనంగా జేబులు కొల్లాగొడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న లెక్కకు మించిన దుకాణాల్లో ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయి. విజయవాడలో ఉన్న పీఎన్‌బీఎస్ మొదలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలా బస్టాండ్లలో తాగునీరు, లస్సీ, మజ్జిగ, స్నాక్స్ ఏ వస్తువైనా ఎమ్మార్పీకి మించే వసూలు చేస్తున్నారు.

# బీజేపీకే దక్కిన కరీంనగర్ మేయర్ పీఠం

**కరీంనగర్ మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ**

**మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ - 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ**

**వ్యూహాత్మకంగా వ్యవహరించిన బండి సంజయ్**



కరీంనగర్ మేయర్ పీఠం ఏ పార్టీకి దక్కనుందనే ఉత్కంఠకు తెర పడింది. కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవికి పోటీ పడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి 21 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది. అధికార దుర్వినియోగం చేశారు : కరీంనగర్ గడ్డ మీద ప్రజాస్వామ్యం నిలబడిందని బండి సంజయ్ అన్నారు. మేయర్‌గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సునీల్ రావుకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజల సహకారంతో ఇది సాధ్యం అయిందని తెలిపారు. పక్క పార్టీలతో జరిగిన కబడ్డీ కప్‌లో బీజేపీ గెలిచిందన్నారు. కాంగ్రెస్ నేతలు అనేక కుట్రలకు పాల్పడ్డారని, అవన్నీ బయటికి చెప్పలేమని పేర్కొన్నారు. కరీంనగర్ బల్దియాపై కాషాయ జెండా ఎగురవేయాలన్న కల నెలవేరిందని గుర్తు చేశారు.

**కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో బండి సంజయ్**

కరీంనగర్‌లో మూడు పార్టీలు కలిశాయి : ప్రభుత్వం ఏర్పడాలన్న పోవాలన్నా కరీంనగర్ నుంచే, అందుకే బీజేపీని అడ్డుకునేందుకు అనేక కుట్రలు పన్నారని విమర్శించారు. కార్పొరేటర్లు అందరూ వెళ్లి కేంద్ర మంత్రి, సీఎంను కలిసి నిధుల కోసం అడుగుతామని, మేయర్‌గా బీజేపీ నేత కాకుండా అనేక ప్రచారాలు చేశారని, వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, అమ్మవారిని నమ్ముకొన్నామని అన్నారు. ప్రజల మద్దతు ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు కుట్రలు చేశారో అర్థం కాలేదని, మేజిక్ ఫిగర్ లేకున్నా ఎందుకు కుట్రలు పన్నారో తెలియదని, చీకటి ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆట ప్రారంభిస్తే ఇప్పుడు తాము ముగించామని, కరీంనగర్‌లో మూడు పార్టీలు కలిసి మమల్ని అడ్డుకున్నారని ఆరోపించారు. మీరంతా ఒక్కటే అని రుజువయిందని అన్నారు.

**కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్**

"ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తర్వాత రాజకీయాలు పక్కనపెట్టాలి. కరీంనగర్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల బరిలోకి దిగాం. కరీంనగర్ అభివృద్ధికి కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులనూ కలుస్తాం. బీజేపీ మేయర్ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా వదిలేది లేదు. బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలన్నీ కలిసి సాధించింది ఏంటి?. ఎన్నికల్లో మేం గెలిచినా మేయర్‌గా ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కుట్రలు చేశాయి."- బండి సంజయ్, కేంద్రమంత్రి

**ప్రమాణ స్వీకారం :** అంతకు ముందు కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రత్యేక అధికారి ఆర్డీవో మహేష్ సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్, మానకొండూరు ఎమ్మెల్యే, ఎక్స్ అఫిషియో సభ్యుడు సత్యనారాయణ హాజరైయ్యారు.

**ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు :** 66 స్థానాలున్న కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచినప్పటికీ బల నిరూపణ చేసుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా? అనే ఉత్కంఠ నెలకొంది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారని సమాచారం. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించినట్లు తెలుస్తోంది. మేయర్ పదవి కోసం ఇరువర్గాల (కాంగ్రెస్, బీజేపీ) మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని బీజేపీనే దక్కించుకుంది.

# తెలంగాణలోని కొత్త మేయర్లు, డిప్యూటీ మేయర్లు

**కాంగ్రెస్ ఎన్ని స్థానాల్లో గెలిచిందంటే?**

**మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఎన్నిక పూర్తి**

**అధికార కాంగ్రెస్ 5, బీజేపీ 1, సీపీఐ 1 స్థానాలు కైవసం**

**ఖాతా తెరవని ప్రతిపక్ష బీఆర్ఎస్.**




తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఎన్నికయ్యారు. 7 కార్పొరేషన్లలో అధికార కాంగ్రెస్ 5, బీజేపీ 1, సీపీఐ 1 స్థానాల్లో ఎంపికయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల దారిలోనే నడిచింది. 7 కార్పొరేషన్లలో ఖాతా తెరవలేదు. కాంగ్రెస్ దక్కించుకున్న కార్పొరేషన్లు : నిజామాబాద్ ,మంచిర్యాల,మహబూబ్‌నగర్,రామగుండం,నల్గొండ,మంచిర్యాల, రామగుండం, మహబూబ్‌నగర్, నల్గొండ నగరపాలికల్లో స్పష్టమైన మెజారిటీ ఉండగా ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్ పీఠాన్ని దక్కించుకుంది.

**బీజేపీ కైవసం చేసుకున్న కార్పొరేషన్ : కరీంనగర్**

**సీపీఐ దక్కించుకున్న కార్పొరేషన్ : కొత్తగూడెం**

నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి అధికార కాంగ్రెస్ మేయర్ పీఠం కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎంపికయ్యారు. నల్గొండ నగరపాలక సంస్థ కాంగ్రెస్ దక్కించుకుంది. తొలి మేయర్‌గా బుర్రి చైతన్య నియమితులయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మహ్మద్ అశ్రఫ్ అలీని వరించింది. మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం అయింది. మేయర్‌గా ధర్ని మధు, డిప్యూటీ మేయర్‌గా రమ్య ఎంపికయ్యారు. కొత్తగూడెం మేయర్ స్థానాన్ని సీపీఐ దక్కించుకుంది. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐ కైవసం చేసుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మేయర్ పదవి సీపీఐకి దక్కగా డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది. మేయర్‌గా మూడ్ గణేశ్, డిప్యూటీ మేయర్‌గా లలితకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన గుముల మమత ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మారేపల్లి సురేందర్ రెడ్డిని వరించింది. రామగుండం కార్పొరేషన్ మేయర్‌గా కాంగ్రెస్ మద్దతుదారుడు మహంకాళి స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఎల్లయ్యను ఎన్నుకున్నారు. కరీంనగర్ మేయర్ పీఠంను ఎట్టకేలకు బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని ఆ పార్టీ దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా చెందిన సునీల్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవికి పోటీ పడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి 21 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది.

# దాడులు, ఉద్రిక్తతలు, బలప్రదర్శనలు

**11 మున్సిపాలిటీల్లో ఛైర్మన్ ఎన్నిక వాయిదా**

**హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల వద్ద ఉద్రిక్తత**

**కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని కేసులు - పలుచోట్ల కార్యకర్తల ఆందోళనలు**

**11 మున్సిపాలిటీలలో ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేసిన అధికారులు**




తెలంగాణలోని పురపాలిక సంఘాల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా పలు చోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు మధ్య తోపులాట చోటు చేసుకున్నాయి. మరికొన్నిచోట్ల ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఉద్రిక్తతలు, ఇతర కారణాలతో తెలంగాణ వ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. 11 మున్సిపాలిటీల్లో ఛైర్మన్ ఎన్నిక వాయిదా : తెలంగాణ వ్యాప్తంగా పలు కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. తొర్రూర్, ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగాంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తొర్రూరులో 16 వార్డులు ఉండగా బీఆర్ఎస్-9, కాంగ్రెస్ -7 గెలుచుకున్నాయి. దీంతో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎక్స్‌అఫీషియో ఓట్లతో బలాబలాలు సమానమయ్యాయి. ఈ నేపథ్యంలో కడియం కావ్య ఓటుపై అభ్యంతరం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. వరంగల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని ఆరోపిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఒకరికొకరు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. ఒక దశలో ఇరువర్గాల వాళ్లు దాడి చేసుకునేంత పరిస్థితి వచ్చింది. ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత : ఇబ్రంహీపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ రేపటికి ఎన్నిక వాయిదా పడటంతో ఆందోళన నెలకొంది. కాంగ్రెస్., బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం రేపటికి వాయిదా పడింది. ప్రమాణస్వీకారానికి 21 మంది సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రేపటికి వాయిదా పడింది. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పేర్లను పార్టీలు ఖరారు చేయకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రేపటికి వాయిదా పడింది. కోరం లేనందున ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. చౌటుప్పల్ 13వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన బత్తుల వాణి మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇస్తారని భావించారు. చివరి క్షణంలో మరొక అభ్యర్థి పావనికి ఛైర్ పర్సన్ ఇస్తున్నారని తెలిసి బత్తుల వాణి మద్దతుదారులు ఆందోళనకు దిగారు. స్థానికేతరులకు ఛైర్ పర్సన్ పదవీ ఎలా ఇస్తారని ఆందోళన చేపట్టారు. ప్రమాణ స్వీకారోత్సవంలో రసాభాస : సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో రసాభాస నెలకొంది. సిరిసిల్ల వైస్‌ఛైర్మన్‌గా బుర్రా నారాయణ పేరును మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. సీల్డ్ కవర్‌లో బుర్రా నారాయణ పేరు లేకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహనికి గురయ్యారు. సీల్డ్‌కవర్‌లో ఛైర్మన్‌గా కళాచక్రపాణి, వైస్‌ఛైర్మన్‌గా సందీప్ పేర్లు ఉన్నట్లు సమాచారం అందడంతో శ్రేణులు ఆందోళనకు దిగాయి. జనగామ పురపాలికలో రాజకీయాలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. జనగామలో 30 వార్డులకుగానూ మిత్రమైన పక్షమైన సీపీఎం గెల్చుకున్న ఒకవార్డుతో కలిసి కాంగ్రెస్ కూటమికి 13 వార్డులు దక్కగా విపక్ష బీఆర్ఎస్ కూడా అంతే సమానంగా 13 వార్డులు గెలుచుకుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు నమోదు చేసుకోవడంతో ఇరుపార్టీలు మళ్లీ చెరో 14 ఓట్లతో సమంగా ఉన్నాయి. దీంతో జనగామ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకోవడంలో స్వతంత్రులే కీలకంగా మారారు. ప్రమాణస్వీకారం క్యాంపుల నుంచి జనగామ మున్సిపల్ కేంద్రం వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ల వాహనాల్ని పోలీసులు అడ్డుకున్నారు. 28వ వార్డు కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేశారని ఆమె మరిది కంప్లైంట్ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పిన డీసీపీ ఆమెను వదిలి వెళ్లాలని కోరారు. ఈ నేపథ్యంలో డీసీపీకి పల్లాకు మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు అక్కడ ఎన్నికను వాయిదా వేశారు. క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసు వద్ద ఉద్రిక్తత : మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసు వద్ద ఉద్రిక్తత నెలకొంది. అభ్యర్థులతో కలిసి వచ్చిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌ను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో అభ్యర్థులతో కలిసి బాల్క సుమన్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అప్పుడే.. మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోరం లేక చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు.

# సేరూ అప్పు కట్టేస్తా! - రెండేళ్ల క్రితం కుదవపెట్టుకున్న నగలు ఇచ్చేయవా!

**పుత్తడి ధర భారీగా పెరగడంతో కొత్త సమస్య ప్రారంభం**

**ఏళ్ల కిందట తాకట్టు బంగారాన్ని విడిపించుకోవాలని వినియోగదారుల పాట్లు**

**తాకట్టు వివాదాలతో పోలీసుల వద్దకు చేరుకున్న వివాదాలు**

రష్యా-యుక్రెయిన్ యుద్ధం పుణ్యమా, మారిన అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ భారీగా పెరిగింది. డాలర్లకు బదులు ప్రపంచ దేశాలు పుత్తడి కొనుగోళ్లు ప్రారంభించాయి. ఫలితంగా ఏడాది గోల్డ్ రేట్ డబుల్ అయింది. దీంతో సామాన్య ప్రజలు పసిడి తీసుకోవాలంటే హడలిపోతున్నారు. ఉన్న బంగారాన్ని జాగ్రత్తగా పరుచుకుంటున్నారు. గతంలో వివిధ కారణాల వల్ల తాకట్టుపెట్టి వదిలేసుకున్న బంగారం గురించి ఆరా తీయడం మొదలు పెట్టారు. అప్పట్లో కొందరు బంగారం తాకట్టు పెట్టి ఆర్థిక ఇబ్బందుల వల్ల డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. తీసుకున్న అప్పు కంటే ఇప్పుడు బంగారం విలువ భారీగా పెరిగి పోవడంతో మళ్లీ ఇప్పుడు ఆ డబ్బులు ఇస్తామని తమ నగలను తిరిగి ఇచ్చేయమని కొందరు తాకట్టు వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. అయితే ఇక్కడే సమస్య మొదలవుతోంది. ఏళ్ల క్రితం ఇచ్చిన నగలకు వడ్డీ, అసలు కట్టేస్తామని దుకాణాలు, ఆఫీసుల వద్దకు వెళ్లితే వాళ్లు తాకట్టు వ్యాపారులు షాకిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆ నగలను వెనక్కి తీసుకోలేరన్న నమ్మకంతో వ్యాపారులు అప్పుడే దాన్ని విక్రయించడం, కరిగించేసి బిస్కెట్లు చేయించుకున్నారు. నగరంలో ఇటీవల ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

**పరిష్కారం కాకపోవడంతో ఠాణాలకు :** హైదరాబాద్‌లోని చార్మినర్, సికింద్రాబాద్, ఖైరతాబాద్ పరిధిలో బంగారం దుకాణాలు, ఆభరణాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ వ్యాపారులు ఇలా నగలు తాకట్టు పెట్టుకొని డబ్బులు ఇస్తుంటారు. ఏళ్లుగా ఈ దందా నడుస్తోంది. ఇప్పుడు తమ పాత నగలు ఇవ్వాలని వస్తున్న కస్టమర్లతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడు నగలు లేవని, డబ్బులు ఇవ్వాల్సిన పని లేదని చెబుతున్నారు. అయితే లోన్ కంటే బంగారు ధర ఎక్కువ కావడంతో రుణం తీసుకున్న వారు గొడవకు దిగుతున్నారు. అటు తిరిగి, ఇటు తిరిగి ఈ వివాదాలు కాస్త పోలీస్ స్టేషన్లకు చేరుతున్నాయి. ఇటీవల ఇలాంటి వివాదాలు గల్లీకొకటి జరుగుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం ఓ గృహిణి 20 గ్రాముల బంగారం తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నారు. కానీ దానికి అసలు, వడ్డీ చెల్లించలేక వదిలేశారు. కానీ ఈ మధ్య ఆమె తన ఆభరణాలు ఇవ్వాలంటూ వ్యాపారి వద్దకు వెళ్లారు. ఇక్కడ విషయం ఏమిటంటే ఆ బంగారాన్ని వారు ఎప్పుడో కరిగించి అమ్మినట్లు తెలియడంతో డబ్బు ఎంతైనా తిరిగి ఇస్తానంటూ హల్‌చల్ చేసింది. ఈ క్రమంలో న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**అప్పటి బంగారం ఇప్పుడు లేదుగా :** సివిల్ వివాదాలు కావడంతో ఏం చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై ఇరువర్గాలకు నచ్చజెప్పలేక, వారి సమస్యను పరిష్కరించ లేక మధ్యలో సతమతమవుతూనే ప్రయత్నాలు చేస్తున్నామని అధికారి పేర్కొన్నారు. కొందరు ఆర్థిక ఇబ్బందులు, నగల విలువ కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన సమయంలో వాటిని వదిలేస్తారు. దీన్ని కారణాలు ఏవైనా కావచ్చు ఫోన్ చేసినప్పుడు స్పందించక పోవడం, ఇచ్చిన గడువు అయిపోవడంతో వ్యాపారులు తాకట్టు పసిడిని విక్రయించడం, వాటిని కరిగించి బిస్కెట్‌లుగా మార్చడం వంటివి చేస్తుంటారు.

**నగరంలో పెరుగుతున్న చైన్ స్నాచింగ్‌లు :** మరోవైపు బంగారం ధరలు పెరగడంతో, చోరీలు కూడా ఎక్కువయ్యాయి. ఇటీవల చైన్ స్నాచింగ్‌లు మళ్లీ ఎక్కువయ్యాయి. బంగారం ధరించే వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. 4 రోజుల క్రితం అబిడ్స్‌లో ఓ యువతి డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళుతుండగా యువకుడు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 30గ్రాముల బంగారు చైన్ కొట్టేశాడు. పట్టపగలే సిటీ నడిబొడ్డున జరిగిన ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మొత్తానికి సాయంత్రం వరకు నిందితుడిని అరెస్ట్ చేసి చైన్ రికవరీ చేశారు. ఇలా స్నాచింగ్‌లు పెరుగుతున్నందున మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వారు కూడా పెట్రోలింగ్ పెంచి ఇలాంటి గ్యాంగ్‌ల పని పడుతున్నారు.

# పంజాగుట్టలో నగల దుకాణంలో రూ.1 కోటి విలువైన బంగారం చోరీ

**జోయ్ అలుక్కాస్ నగల దుకాణంలో బంగారం చోరీ**

**అనుమానం రాకుండా రోజూ కొన్ని**

**నగలు దొంగిలించిన ఉద్యోగి**

**విలువైన ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులను**

**ఆశ్రయించిన యాజమాన్యం**



హైదరాబాద్‌లో ఒక బంగారం దుకాణంలో భారీ దోపిడీ జరిగింది. దుకాణంలో పని చేసే ఉద్యోగి రూ.1 కోటి విలువ చేసే ఆభరణాలను దొంగిలించాడు. ఎవరికీ అనుమానం రాకుండా రోజూ కొన్ని ఆభరణాలను దొంగిలించాడు. పంజాగుట్టలోని జోయ్ అలుక్కాస్ నగల దుకాణంలో పని చేసే ఉద్యోగి అజిత్ ఈ దొంగతనానికి పాల్పడ్డట్టు వెల్లడైంది. విలువైన ఆభరణాలు కనిపించకపోవడంతో యాజమాన్యం పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఆభరణాలను ఎత్తుకువెళ్లిన ఉద్యోగిని గుర్తించి యాజమాన్యం పిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడికి ఎవరైనా సహాయం చేశారా? లేక అతడు సొంతంగా చేశాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# ఇండియా- యూకే ట్రేడ్ డీల్ ఏప్రిల్ నుంచే అమల్లోకి!

**భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం**

**గత ఏడాది జులైలో సంతకం చేసిన దేశాలు**

**2026 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చే అవకాశం**



భారత్- బ్రిటన్ మధ్య గతేడాది జులైలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం 2026 ఏప్రిల్‌లో అమలు అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఈ అగ్రిమెంట్ ప్రకారం, భారత్ నుంచి వెళ్లే 99శాతం ఎగుమతులపై సుంకాలు తగ్గనున్నాయి. అదేవిధంగా బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతయ్యే కార్లు, స్కాచ్ విస్కీ వంటి బ్రిటిష్ ఉత్పత్తులపై కూడా సుంకాలు తగ్గనున్నాయి.

**హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చలు**

ఇటీవల యూకే పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో భారత్- యూకే సీఈటీఏపై చర్చలు నిర్వహించారు. ఆ సందర్భంగా యూకే వ్యాపార, వాణిజ్య శాఖ మంత్రి క్రిస్ బ్రయంట్ మాట్లాడారు. ఈ ఒప్పందం ఇరుదేశాల మధ్య చారిత్రాత్మక నిర్ణయమని, దీనివల్ల యూకే వ్యాపారాలకు భారత్‌లో విస్తృత అవకాశాలు కల్పించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి ముందు, రెండు సభల్లో చర్చలు, కమిటీ సమీక్షలు నిర్వహిస్తాయని ఆయన పేర్కొన్నారు. అయితే, యూకే పార్లమెంట్ ఆమోదించిన తర్వాత పరస్పర అంగీకార తేదీని నిర్ణయించి అమలు చేయనున్నారు. అయితే, భారత్‌లో ఇలాంటి అంతర్జాతీయ ఒప్పందాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం ఉందని తెలుస్తోంది.

**వీటిపై తగ్గనున్న సుంకాలు!**

ఈ ఒప్పందం ప్రకారం భారత్ కొన్ని వినియోగ వస్తువుల కోసం తన మార్కెట్‌ను తెరవనుంది. అందులో చాక్లెట్లు, బిస్కెట్లు, సౌందర్య ఉత్పత్తులు వంటి వస్తువులపై సుంకాలు తగ్గనున్నాయి. మరోవైపు భారత్‌కు వస్త్రాలు, పాదరక్షలు, రత్నాలునగలు, క్రీడా సామగ్రి, బొమ్మలు వంటి ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేయడంలో విస్తృత అవకాశాలు లభించనున్నాయి.మరోవైపు, ఈ ఒప్పందం ప్రకారం, స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం దిగుమతి సుంకాన్ని 75 శాతానికి తగ్గుతాయి. అదేవిధంగా, రానున్న రోజుల్లో వాటిని మరింత తగ్గించనున్నారు, అంటే 2035 నాటికి దాన్ని 40 శాతానికి తీసుకురానున్నారు. మరోవైపు, ఆటోమొబైల్ రంగంలో కూడా సుంకాలు తగ్గుముఖం పట్టనున్నాయి. ప్రస్తుతం ఉన్న 110 శాతం సుంకాలను ఐదేళ్లలో 10 శాతానికి తగ్గించనున్నారు. ఇది దశలవారీ కోటా విధానంలో అమలు కానుంది.

**గతేడాది ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరుదేశాలు**

ఇదిలా ఉండగా, భారత్- యూకేల మధ్య కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలు 2025 మే 6నే ఓ కొలిక్కి వచ్చాయి. ఆనాడే ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని ఇరుదేశాలు ఓ అంగీకారానికి వచ్చాయి. మొత్తానికి జులై 24న సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం పై భారత్- యూకేలు సంతకాలు చేశాయి. అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో రెండు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, జోనాథన్ రేనాల్డ్స్ ఖీూపై సంతకాలు చేశారు. అయితే, ఈ ఒప్పందంతో సరళతరమైన వాణిజ్య విధానాలతో ఇరుదేశాలు పరస్పరం ఎగుమతి, దిగుమతులను ప్రోత్సహించనున్నాయి. అదేవిధంగా ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్యం 34బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి 2030 నాటికి ప్రపంచంలోని ఐదో లేదా ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య 56 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని జజుూా లక్ష్యంగా పెట్టుకుంది. అదేవిధంగా, ఈ డీల్‌తో ప్రధానంగా భారత్‌లోని చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరనుందని పరిశీలకులు భావిస్తున్నారు. పన్నుల భారం లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేసేందుకు భారత్‌కు అవకాశం లభించనుంది. దీనివల్ల భారతీయ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మెరుగైన రేట్లు దక్కనున్నాయి.

# లక్ష లోపునకు బంగారం ధర?

**ప్రముఖ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ జోస్యం**

**2027 చివరి నాటికి బంగారం ధర రూ.లక్ష లోపునకు పడిపోతుందని అంచనా**

**ప్రముఖ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ సంచలన విశ్లేషణ**

**ఇప్పటికే రికార్డు స్థాయి నుంచి 13.5% తగ్గిన పసిడి ధరలు**

**రష్యా మళ్ళీ డాలర్ వాణిజ్యం ప్రారంభిస్తే బంగారం డిమాండ్ తగ్గే అవకాశం**



ముంబై: బంగారం ధరలు సమీప భవిష్యత్తులో భారీగా పడిపోయే అవకాశం ఉందని, 2027 చివరి నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష లోపునకు దిగిరావొచ్చని ప్రముఖ ఆర్థికవేత్త, పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ సంచలన అంచనా వేశారు. ఇటీవలి కాలంలో రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి ధరలు ఇప్పటికే కొంతమేర తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ కరెక్షన్ మరింత లోతుగా ఉండబోతోందని ఆయన హెచ్చరించారు.ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు సుమారు 5,000 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది జనవరిలో నమోదైన గరిష్ఠ స్థాయి 5,626 డాలర్లతో పోలిస్తే తక్కువే. ఇక భారత మార్కెట్లో (వీజశ) 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,56,200 వద్ద ఉంది. జనవరిలో నమోదైన ఆల్-టైమ్ హై రూ.1,80,779తో పోలిస్తే ఇది ఇప్పటికే 13.5% పతనం.ఈ నేపథ్యంలో అమిత్ గోయల్ మాట్లాడుతూ, "2027 చివరి నాటికి కామెక్స్ గోల్డ్ ధర ఔన్సుకు 3,000 డాలర్ల స్థాయికి, భారత మార్కెట్లో తులం బంగారం ధర రూ.90,000 నుంచి రూ.1,00,000 మధ్యకు స్థిరపడవచ్చు" అని ఫిబ్రవరి 15న ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా రష్యా తిరిగి అమెరికా డాలర్లతో వాణిజ్య లావాదేవీలు ప్రారంభించవచ్చనే వార్తలు ఇందుకు కారణంగా నిలుస్తాయని ఆయన విశ్లేషించారు. అదే జరిగితే, డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే (డీ-డాలరైజేషన్) ఒత్తిడి తగ్గి, సెంట్రల్ బ్యాంకులు బంగారం కొనుగోళ్లను తగ్గించే అవకాశం ఉందని వివరించారు.

**గత అంచనాలు, ప్రస్తుత పరిస్థితి**

అమిత్ గోయల్ గత కొంతకాలంగా బంగారం ధరలు అధికంగా ఉన్నాయని హెచ్చరిస్తూనే ఉన్నారు. 2025 ఆగస్టులో ఔన్సు బంగారం ధర 3,335 డాలర్లుగా ఉన్నప్పుడు, అది 2,800 డాలర్లకు పడిపోతుందని ఆయన అంచనా వేశారు. అయితే, మార్కెట్ ఆయన అంచనాలకు విరుద్ధంగా కదిలి, 2026 జనవరి నాటికి రికార్డు స్థాయికి చేరింది. అయినప్పటికీ తన హెచ్చరికలను కొనసాగించిన ఆయన, ఈ పెరుగుదలను "క్లాసిక్ కమొడిటీ బబుల్"గా అభివర్ణించారు.ప్రస్తుతం ధరలు తగ్గుముఖం పట్టడం ఆయన విశ్లేషణకు పాక్షికంగా బలం చేకూరుస్తోంది. అయితే, జేపీ మోర్గాన్, ఏఎన్‌జెడ్ వంటి ఇతర సంస్థల విశ్లేషకులు మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ కొనసాగుతుందని, 2026 చివరి నాటికి బంగారం ధర ఔన్సుకు 5,000-5,800 డాలర్ల స్థాయికి చేరవచ్చని వారు అంచనా వేస్తున్నారు.లైవ్‌మింట్, మనీకంట్రోల్, రాయిటర్స్ వంటి పలు వార్తా సంస్థల కథనాల ప్రకారం, మార్కెట్ ప్రస్తుతం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆధారపడి తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పాత సిమ్ కార్డుల నుంచి రూ.27 లక్షల బంగారం!

**చైనాలో పాత సిమ్ కార్డుల నుంచి బంగారం వెలికితీత**

**రెండు టన్నుల ఈ-వేస్ట్ నుంచి 191 గ్రాముల బంగారం సేకరణ**

**దీని విలువ సుమారు రూ. 27 లక్షలు ఉంటుందని అంచనా**

**ఇది ప్రమాదకరమని, ఎవరూ ప్రయత్నించవద్దని నిపుణుడి హెచ్చరిక**



పనికిరానివని పడేసే పాత సిమ్ కార్డులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) నుంచి ఓ వ్యక్తి ఏకంగా రూ. 27 లక్షల విలువైన బంగారం తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌కు చెందిన కియావో అనే వ్యక్తి ఈ ఘనత సాధించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళితే, ప్రొఫెషనల్ స్క్రాప్ మెటల్ రీఫైనర్ అయిన కియావో, దాదాపు రెండు టన్నుల పాత టెలికాం చిప్‌లు, సిమ్ కార్డులు వంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాడు. వీటి నుంచి క్లిష్టమైన రసాయన ప్రక్రియ ద్వారా సుమారు 191 గ్రాముల స్వచ్ఛమైన బంగారాన్ని వెలికితీశాడు. దీని విలువ దాదాపు 2 లక్షల యువాన్లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 26 నుంచి 27 లక్షల వరకు ఉంటుందని అంచనా. జనవరి 20న తాను ఈ ప్రక్రియ చేస్తున్న వీడియోను పంచుకోగా, అది 5 మిలియన్లకు పైగా వీక్షణలు పొందింది.ఈ-వేస్ట్‌ను రసాయనాల్లో ముంచి, వేడి చేసి, ఫిల్టర్ చేయడం ద్వారా బంగారాన్ని వేరు చేసినట్టు కియావో చూపించాడు. అయితే, ఇది చాలా ప్రమాదకరమైన ప్రక్రియ అని, ఇందులో వాడే రసాయనాల వల్ల ప్రాణాంతక వాయువులు వెలువడతాయని హెచ్చరించాడు. తన నైపుణ్యాన్ని ప్రదర్శించడానికే ఈ వీడియో పోస్ట్ చేశానని, సామాన్యులు ఎవరూ దీన్ని ప్రయత్నించవద్దని స్పష్టం చేశాడు.చైనాలో ఇలా బంగారం శుద్ధి చేయడంపై కఠినమైన నిబంధనలు ఉన్నాయి. అనుమతి లేనిదే దీన్ని చేస్తే భారీ జరిమానాలు, జైలు శిక్ష పడతాయి. అయితే, తనకు అధికారికంగా లైసెన్స్ ఉందని కియావో పేర్కొన్నాడు. ఈ వీడియో వైరల్ అయిన తర్వాత, చైనాలో పాత సిమ్ కార్డులు, గోల్డ్-రిఫైనింగ్ కిట్‌లకు ఆన్‌లైన్‌లో డిమాండ్ అమాంతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# బ్యాంకింగ్ షేర్ల జోరు.. రెండు రోజుల నష్టాలకు బ్రేక్

**రెండు రోజుల నష్టాలకు తెరదించుతూ లాభాల్లో ముగిసిన సూచీలు**

**650 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 211 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ**

**బ్యాంకింగ్ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లతో మార్కెట్లకు మద్దతు**

**ఆర్బీఐ నిబంధనల మార్పుతో కొన్ని క్యాపిటల్ మార్కెట్ షేర్లు డీలా**

**డాలర్‌తో పోలిస్తే స్థిరంగా కదలాడిన రూపాయి మారకం విలువ**



రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ సోమవారం భారత స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లలో చివరి గంటలో వెల్లువెత్తిన కొనుగోళ్లతో సూచీలు పరుగులు పెట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 650.39 పాయింట్లు లాభపడి 83,277.15 వద్ద స్థిరపడింది. అలాగే, నిఫ్టీ 211.65 పాయింట్లు పెరిగి 25,682.75 వద్ద నిలిచింది.మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 25,500-25,400 పాయింట్ల శ్రేణి కీలక మద్దతుగా ఉంది. ఈ స్థాయిని కాపాడుకున్నంత కాలం మార్కెట్ సానుకూలంగానే ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. ఎగువన 25,700-25,800 వద్ద నిరోధం ఉందని, దానిని దాటితే 25,900-26,000 స్థాయిలకు చేరవచ్చని విశ్లేషకులు తెలిపారు.ఈ రోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు మార్కెట్ రికవరీకి నాయకత్వం వహించాయి. సెన్సెక్స్ షేర్లలో పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ 4.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటివి నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ, పీఎస్‌యూ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు, ఫార్మా షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించగా, ఆటో, మెటల్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.అయితే, క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్‌కు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనలను సవరించడంతో బీఎస్ఈ, ఏంజెల్ వన్, ఎంసీఎక్స్ వంటి షేర్లు 10 శాతం వరకు నష్టపోయాయి. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 90.62 వద్ద దాదాపు స్థిరంగా ట్రేడ్ అయింది.

## రొమాంటిక్ మోడల్‘కు గుడ్ బై చెప్పిన ఓపెన్ ఏఐ

**యూజర్ల తీవ్ర విచారం**

**చాట్‌జీపీటీ యాప్ నుంచి జీపీటీ-4శీ మోడల్ తొలగింపు**

**దాన్ని ఓ టూల్‌గా కాకుండా రొమాంటిక్ తోడుగా భావిస్తున్న యూజర్లు**

**ఓపెన్‌ఏఐ నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు**

**జీపీటీ-4శీను కొనసాగించాలని 20,000 మందికి పైగా సంతకాలతో పిటిషన్**

**చైనాలోనూ శామ్ ఆల్ట్‌మన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫ్యాన్స్**




ప్రముఖ ఏఐ సంస్థ ఓపెన్‌ఏఐ తీసుకున్న ఓ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలువురు యూజర్లను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. చాట్‌జీపీటీ యాప్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన జీపీటీ-4శీ ఏఐ మోడల్‌కు యాక్సెస్‌ను కంపెనీ పూర్తిగా తొలగించింది. దీన్ని కేవలం ఒక టూల్‌గా కాకుండా, తమకు మానసికంగా తోడుండే స్నేహితుడిగా భావించే యూజర్లు ఈ పరిణామంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇతర ఏఐ మోడళ్ల కంటే జీపీటీ-4శీ వెర్షన్ మరింత ఆప్యాయంగా, అర్థం చేసుకునే తత్వంతో, కాస్తంత రొమాంటిక్ గానూ ఉంటుందని యూజర్లు నమ్ముతారు. వాస్తవానికి, గత ఏడాది 2025 ఆగస్టులోనే దీన్ని తొలగించాలని ఓపెన్‌ఏఐ ప్రయత్నించగా, తీవ్ర వ్యతిరేకత రావడంతో పెయిడ్ యూజర్లకు మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. అయితే, ఫిబ్రవరి 13న యాప్ యూజర్ల కోసం ఈ మోడల్‌ను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం నుంచి డెవలపర్‌లకు కూడా ఏపీఐ యాక్సెస్‌ను నిలిపివేయనుంది.ఈ నిర్ణయంపై యూజర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జీపీటీ-4శీను కొనసాగించాలని కోరుతూ జష్ట్రుఅస్త్రవ.శీతీస్త్రలో పెట్టిన పిటిషన్‌పై ఇప్పటికే 20,000 మందికి పైగా సంతకాలు చేశారు. సిరాక్యూస్ యూనివర్సిటీ పరిశోధన ప్రకారం, 33 శాతం మందికి పైగా యూజర్లు దీన్ని ఒక టూల్ కంటే ఎక్కువగా భావిస్తుండగా, 22 శాతం మంది దీన్ని ఒక తోడుగా అభివర్ణించారు.చైనాలో చాట్‌జీపీటీపై నిషేధం ఉన్నప్పటికీ, వీపీఎన్ ద్వారా దీన్ని వాడే యూజర్లు సైతం తీవ్రంగా స్పందిస్తున్నారు. కొందరు తమ సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేసుకుంటామని హెచ్చరిస్తుండగా, మరికొందరు ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను నిలదీస్తూ, మైక్రోసాఫ్ట్, సాఫ్ట్‌బ్యాంక్ వంటి ఇన్వెస్టర్లకు ఈ-మెయిల్స్ పంపుతున్నారు. డెవలపర్లు బేస్ మోడల్‌ను యాక్సెస్ చేయవచ్చని ఓపెన్‌ఏఐ చెబుతున్నా, అది తమకు ఇష్టమైన టెక్స్ట్-ఓన్లీ వెర్షన్ అంత బాగా లేదని ఫ్యాన్స్ వాదిస్తున్నారు. తమ ఆవేదనను కంపెనీ పట్టించుకోవడం లేదని వారు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## ఏఐతో ఐటీ సేవలకు ముప్పుందా?

**జేపీ మోర్గాన్ నివేదిక ఏం చెబుతోందంటే...!**


**ఏఐతో ఐటీ సర్వీసెస్ కంపెనీలకు ముప్పు లేదన్న జేపీ మోర్గాన్**

**ఉద్యోగాలను తీసేయదు, కొత్త పనులను సృష్టిస్తుందని వెల్లడి**

**గతంలోని క్లౌడ్ కంప్యూటింగ్ వంటిదే ఏఐ కూడా అని విశ్లేషణ**

**టెక్ ప్రపంచంలో ఐటీ కంపెనీలను 'ప్లంబర్లు'గా అభివర్ణన**

**ఏఐపై పెట్టుబడిదారుల్లో భయాలు అక్కర్లేదని స్పష్టం**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో ఐటీ సర్వీసెస్ కంపెనీల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న ఆందోళనల నడుమ ప్రముఖ రీసెర్చ్ సంస్థ జేపీ మోర్గాన్ కీలక నివేదికను విడుదల చేసింది. ఏఐ వల్ల ఐటీ రంగం పరిధి తగ్గిపోదని, సమీప భవిష్యత్తులో ఈ రంగం అంతరించిపోయే ముప్పేమీ లేదని స్పష్టం చేసింది. పైగా, ఏఐ అనేది ఐటీ కంపెనీలకు మరో శక్తివంతమైన సాధనంగా (టూల్) మారి, మరిన్ని కొత్త పనులను సృష్టిస్తుందని పేర్కొంది.'ఇండియా ఐటీ సర్వీసెస్: లుకింగ్ త్రూ ది ఏఐ ఫాగ్' పేరుతో జేపీ మోర్గాన్ ఆసియా పసిఫిక్ ఈక్విటీ రీసెర్చ్ బృందం ఈ నివేదికను రూపొందించింది. ఏఐ కారణంగా భారత ఐటీ సంస్థలు కనుమరుగవుతాయన్న భయాల్లో నిజం లేదని తేల్చిచెప్పింది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవడం మాట అటుంచి, కొత్త పని అవకాశాలు పుట్టుకొస్తాయని వివరించింది.గతంలో ఆఫ్‌షోర్ లేబర్, ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతిక మార్పులు వచ్చినప్పుడు కూడా ఇలాంటి ఆందోళనలే వ్యక్తమయ్యాయని నివేదిక గుర్తుచేసింది. ఆ టెక్నాలజీలు ఐటీ సేవలను అంతం చేయలేదు, కేవలం పనిచేసే విధానాన్ని మాత్రమే మార్చాయి. ఇప్పుడు ఏఐ కూడా అదే పాత్ర పోషిస్తుందని, అందుబాటులో ఉన్న బడ్జెట్‌లతోనే కంపెనీలు మరిన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఏఐ ఉపయోగపడుతుందని విశ్లేషించింది.పాత లెగాసీ సిస్టమ్‌లను ఆధునికీకరించడం, సాస్ అప్లికేషన్‌లను మార్చడం, ఏఐ ఏజెంట్లను నిర్మించడం, ఏఐ సిస్టమ్‌లలో విశ్వసనీయతను కల్పించడం వంటి అనేక కొత్త రంగాల్లో ఐటీ సేవల అవసరం పెరుగుతుందని జేపీ మోర్గాన్ పేర్కొంది. టెక్ ప్రపంచంలో ఐటీ కంపెనీల పాత్రను 'ప్లంబర్ల'తో పోల్చింది. క్లిష్టమైన వ్యవస్థలను సజావుగా నడిపించడంలో వాటి పాత్ర అత్యంత కీలకమని అభివర్ణించింది. కేవలం ఏఐ భయాలతో ఐటీ స్టాక్స్ బలహీనపడటం సరికాదని, పెట్టుబడిదారుల ఆందోళనలు వాస్తవ దూరమని నివేదిక స్పష్టం చేసింది.

## ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ఒక పూర్తిస్థాయి లీడర్‌గా ఎదిగే సత్తా ఉందని చాట్‌జీపీటీ సృష్టికర్త 'ఓపెన్‌ఏఐ' సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ప్రశంసించారు. అందుకు అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయని అన్నారు. భారత్‌లో చాట్‌జీపీటీని వారానికి 10 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నారని, ఇది తమకు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అని ఆయన వెల్లడించారు.ఫిబ్రవరి 16 నుంచి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభం కానున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక మీడియా కథనంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా తర్వాత భారత్‌లోనే తమకు అత్యధిక యూజర్లు ఉన్నారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి యూజర్లు కూడా భారత్ నుంచే ఉన్నారని, శాస్త్రీయ పరిశోధనల కోసం ఉద్దేశించిన 'ప్రిజమ్' అనే ఉచిత టూల్ వినియోగంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు.వచ్చే వారం తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ఆల్ట్‌మన్ తెలిపారు. ఏఐని "భారత్‌లోనే, భారత్‌తోనే, భారత్ కోసమే" అభివృద్ధి చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతేడాది ఢిల్లీలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది కార్యకలాపాలను మరింత విస్తరించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఏఐ ప్రయోజనాలను అందరికీ అందించేందుకు ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు.అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏఐని క్షేత్రస్థాయికి చేర్చడానికి 'యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీ' అనే త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఇటీవలే నాలుగు భారతీయ నగరాల్లో 200 మందికి పైగా ఎన్జీవో ప్రతినిధులకు చాట్‌జీపీటీ వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## కుటుంబ విలువలతో 'రాయుడి గారి తాలుకా'.. ట్రైలర్ విడుదల, మార్చి 6న థియేటర్లలోకి

శ్రీనివాస్ ఉలిశెట్టి, సత్య ఈషా జంటగా తెరకెక్కుతున్న కుటుంబ కథా చిత్రం 'రాయుడి గారి తాలుకా' ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉలిశెట్టి మూవీస్ బ్యానర్‌పై కొర్రపాటి నవీన్ శ్రీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిత్యశ్రీ, పునర్వికా వేద శ్రీ, నవీన్ శ్రీ, పీజే దేవి, కరణం పేరినాయుడు నిర్మిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, గ్రామీణ నేపథ్యం కలగలిపిన కథతో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో సుమన్, ఆర్.కే. నాయుడు, సలార్ పూజ, కరణం శ్రీహరి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా పనులు జరుపుకుంటోంది. మ్యూజిక్, ఎడిటింగ్, డబ్బింగ్ వంటి కార్యక్రమాలు పూర్తయ్యే దశకు చేరుకున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను 'బంగార్రాజు' ఫేమ్ దర్శకుడు కళ్యాణ్ కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ట్రైలర్‌లో కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, గ్రామీణ జీవనశైలి ప్రధానంగా కనిపించడంతో ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి పెరిగింది. ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ "ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా గురించి ఇప్పటికే చాలా మంది ద్వారా విన్నాను. ఇటీవల కాలంలో ఇలాంటి స్వచ్ఛమైన కుటుంబ కథలు అరుదుగా వస్తున్నాయి. టీమ్ అందరికీ నా బెస్ట్ విషెస్" అని అభినందించారు. హీరో, నిర్మాత ఉలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఇది పూర్తి కుటుంబ చిత్రమే. కుటుంబ విలువలను తెలియజేసే మంచి సందేశాత్మక సినిమా అవుతుంది. ప్రతి వర్గ ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందించాం. మార్చి 6వ తేదీన సినిమాను విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. గ్రామీణ నేపథ్యంతో కుటుంబ బంధాల ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా రూపొందుతున్న 'రాయుడి గారి తాలుకా' ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి స్పందన పొందుతోంది. భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు, వినోదం కలబోసిన ఈ చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుండటంతో కుటుంబ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



## 'జన నాయగన్' విడుదలపై అనిశ్చితి కోర్టు, సెన్సార్ అడ్డంకులతో విజయ్ చివరి చిత్రం ఆలస్యం



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కెరీర్‌లో చివరి చిత్రంగా ప్రచారం పొందుతున్న పొలిటికల్ థ్రిల్లర్ జన నాయగన్ పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజకీయ నేపథ్యం, సామాజిక అంశాల మేళవింపుతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు హెచ్. వినోద్ రూపొందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఖేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడిగా నటిస్తుండగా, హీరోయిన్‌గా పూజా హెగ్డే, కీలక పాత్రలో మమితా బైజు కనిపించనున్నారు. సంగీతాన్ని యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సమకూర్చడం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణగా మారింది. మొదట ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియలో తలెత్తిన సమస్యలతో రిలీజ్ వాయిదా పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కొన్ని సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా మత విభేదాలకు దారితీసే అంశాలు, భద్రతా దళాలు మరియు విదేశీ శక్తుల ప్రస్తావనపై స్పష్టత అవసరమని సూచించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది.




## జగపతి బాబేనా అని అడిగితే కాదని చెప్పా

సింపుల్ లైఫ్‌ని లీడ్ చేసే అదికొద్ది మంది నటుల్లో ఒకరు జగపతి బాబు. ఒప్పుడు హీరోగా మెప్పించిన ఆయన.. ఇప్పుడు విలన్ పాత్రలతో అదరగొట్టేస్తున్నారు. అలాగే పలు చిత్రాల్లో సహాయ నటుడిగా కొనసాగుతున్నారు. అయితే హీరోగా ఉన్నప్పుడు ఎలా ఉండేవాడో ఇప్పుడు కూడా అలానే ఉన్నాడు. ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. షూటింగ్ అయితేపోతే చాలు.. సాధారణ వ్యక్తిలాగే జీవిస్తాడు. సమయం దొరికితే ఒక్కడే రోడ్డుపై నడచుకుం టూ వెళ్తాడు. చుట్టూ ఉన్నవాళ్లతో సరదాగా మాట్లాడతాడు.  అంతేకాదు సెట్‌లో కూడా చాలా అల్లరి చేస్తాడని తోటి నటీనటులు చెబుతుంటారు. మెమోరీస్‌గా ఉండాలంటూ కొన్ని అల్లరి పనులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయట. తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను చేసిన అల్లరి పనుల గురించి చెప్పాడు జగపతి బాబు. షూటింగ్ కోసం విదేశాలకు వెళ్లిన ప్రతిసారి ఏదో ఒక అల్లరి పని చేసి పోలీసు స్టేషన్‌కి వెళ్లి వచ్చేవారట. సెట్‌లో ఉన్నవాళ్లకు కచ్చితంగా మద్యం అందించేవాడట. అలా ఓసారి అమెరికాకి వెళ్లి.. మద్యం మత్తులో  గ్యాంబ్లింగ్ ఆడారట. అక్కడ డబ్బులు వచ్చిన ప్రతిసారి గట్టిగా అరుస్తూ డాన్స్ చేస్తే.. చివరకు పొగపెట్టి గదిలో నుంచి బయటకు పంపేశారని, అది తనకో స్వీట్ మెమోరీ అని అంటున్నాడు జగపతి బాబు.

### బస్సు ఎక్కితే గుర్తుపట్టలేదు


సాధారణ మనిషిలాగానే బతకడం నాకు ఇష్టం. అందుకే వీలు దొరికనప్పుడల్లా సరదాగా బయటకు వెళ్తుంటాను. 'కబడ్డీ కబడ్డీ'సినిమా షూటింగ్ సమయంలో  ఓ రోజు ఎర్రబస్సు ఎక్కితే..ఒక్కరు కూడా గుర్తుపట్టలేదు. రాజోలులో షూటింగ్ జరుగుతున్న సమయంలో.. నా షూట్ అయిపోగానే నడుచుకుంటూ వెళ్లి ఆర్టీసీ బస్సు ఎక్కా. నా వెనక సిబ్బంది కూడా ఎక్కింది.  నన్ను ఎవరూ గుర్తు పట్టలేదు. కాసేపయ్యాక గుసగుసలు మొదలయ్యాయి. జగపతి బానేనా.. జగపతి బానేనా అని ఒకరినొకరు అడుక్కుంటున్నారు. నేను మాత్రం సైలెంట్‌గా ఉన్నా. ఒకరు చూసి.. 'నువ్వు జగపతి బాబువే కదా' అని అన్నారు. నేను వెంటనే కాదని చెప్పా. వాళ్లు సైలెంట్ అయిపోయారు. మా హోటల్ దగ్గర బస్సు ఆగగానే.. దిగేసి 'నేను జగపతి బాబునే' అంటూ గట్టిగా నవ్వుకుంటూ హోటల్‌లోకి వెళ్లిపోయా. ఇలాంటి అల్లరి పనులు చాలానే చేశా' అని జగపతి బాబు చెప్పుకొచ్చాడు.



## భారీ అంచనాల మధ్య విడుదలకి సిద్ధంగా ఉన్న 'పెద్ది'

### బుచ్చిబాబు బర్త్‌డే రోజు నిరాశపరిచారుగా..!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్దిపై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. 'ఉప్పెన'తో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ వాతావరణం, భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుతో వస్తున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్న పాత్రల సమాహారంగా రూపొందుతున్న ఈ సినిమా కాస్టింగ్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ దక్కించుకోగా, తాజాగా ఫిబ్రవరి 15న దర్శకుడు బుచ్చిబాబు సనా జన్మదినం సందర్భంగా మేకర్స్ ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలోని విజువల్స్, ఫ్రేమింగ్, యాక్షన్ షాట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ లుక్ మాస్ అండ్ ఇంటెన్స్‌గా ఉండటంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ప్రతి సన్నివేశం కోసం దర్శకుడు పడుతున్న శ్రమ స్పష్టంగా కనిపిస్తోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ రోజు సినిమా సెకండ్ సాంగ్ విడుదల అవుతుందని అంతా అనుకున్నారు. కాని స్పెషల్ వీడియోతో సరిపెట్టారు. మరి రెండో సాంగ్ ఎప్పుడు విడుదల చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇక చిత్రానికి సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తుండటం ఈ సినిమాకు మరో పెద్ద ప్లస్‌గా మారింది.



## 'స్వయంభూ' టీజర్‌పై చర్చ రగిలించిన నిఖిల్ పోస్ట్ ఎవరిని ఉద్దేశించి ఆ కామెంట్ చేశాడు

టాలీవుడ్‌లో థ్రిల్లర్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక మార్కెట్ సంపాదించుకున్న యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ ప్రస్తుతం భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ స్వయంభూ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందన దక్కించుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. అయితే టీజర్‌కు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో పాటు మరో అంశం టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీజర్‌ను ఎఱ= క్వాలిటీలో మళ్లీ అప్‌లోడ్ చేసిన సందర్భంగా నిఖిల్ చేసిన ఒక కామెంట్ చర్చకు దారితీసింది. యూట్యూబ్ గ్లిట్జ్‌ల వల్ల టీజర్‌ను మళ్లీ అప్‌లోడ్ చేశాం అని పేర్కొన్న ఆయన, చివర్లో "రీసెంట్‌గా వచ్చిన ఒక సినిమాలా మా చిత్రంలో ఎలాంటి ాూ× వినియోగించలేదు అని స్పష్టంగా చెప్పడం విశేషంగా మారింది. ఈ ఒక్క కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిఖిల్ ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేశారనే దానిపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. ఇటీవల విడుదలైన కొన్ని సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీ, ాూ× టూల్స్ వినియోగంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో "నిఖిల్ ఏ సినిమాను టార్గెట్ చేశాడు?" అన్న ప్రశ్న సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చేసిన కామెంట్ అయినా, ఇది ఇండస్ట్రీలో టెక్నాలజీ వినియోగంపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేసింది. కొందరు నిఖిల్ పారదర్శకతను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది అవసరం లేని పోలిక అని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి టీజర్ కంటే ఎక్కువగా నిఖిల్ చేసిన ఈ ాూ× వ్యాఖ్యే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.'స్వయంభూ' సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిన వేళ, ఈ వివాదం కూడా చిత్రానికి అదనపు ప్రచారం తీసుకువచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దర్శకబృందం మాత్రం కంటెంట్ క్వాలిటీ, విజువల్ గ్రాండియర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రిలీజ్ డేట్‌పై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## ధురంధర్ ఫస్ట్ ఛాయిస్ నాగార్జున? స్పందించిన హీరో



గతేడాది చివర్లో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సినిమా ధురంధర్. మౌత్ టాక్‌తోనే క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.1350 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లోనూ దుమ్ము దులుపుతోంది.

### అక్షయ్‌పై సర్వత్రా ప్రశంసలు

రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్ కీలక పాత్రలు పోషించారు. సినిమా రిలీజయ్యాక అందరికన్నా ఎక్కువగా అక్షయ్ పేరే మారుమోగిపోయింది. అతడి స్వాగ్, డ్యాన్స్, లుక్స్ జనాలకు విపరీతంగా నచ్చేసింది. రెహ్మాన్ డకాయిట్‌గా అక్షయ్ అదరగొట్టేశాడని ప్రశంసలు లభించాయి.

### స్పందించిన నాగ్

అయితే రెహ్మాన్ పాత్ర కోసం అక్షయ్ కంటే ముందు నాగార్జునను సంప్రదించారని ఓ వార్త ఫిల్మ్‌దునియాలో వైరలవుతోంది. తాజాగా ఈ ప్రచారాన్ని కింగ్ నాగ్ కొట్టిపారేశాడు. ధురంధర్ సినిమా కోసం తనను సంప్రదించలేదని కుండ బద్దలు కొట్టాడు. ఒకవేళ తనకు అవకాశం ఇచ్చుంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు. ధురంధర్ మూవీ చాలా బాగుందన్నాడు.  ఆదిత్య ధర్ దర్శకత్వం అదిరిపోయిందని, అతడి ముందు సినిమా ఉరి: ద సర్జికల్ స్ట్రైక్ కూడా తనకు ఎంతగానో నచ్చిందని ప్రశంసించాడు. సినిమాలో అందరూ బాగా నటించారని, అక్షయ్ ఖన్నా అద్భుతంగా యాక్ట్ చేశాడని మెచ్చుకున్నాడు. ధురంధర్ సీక్వెల్ కూడా మరింత బ్లాక్‌బస్టర్ అవాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ధురంధర్ 2 మూవీ మార్చి 19న విడుదలవుతోంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.